


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 08 శుక్రవారం ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 324
Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur






## జమ్మూకాశ్మీర్‌లో విషాదం

- ముగ్గురు జవాన్ల మృతి, 15 మంది గాయాలతో ఆసుపత్రిలో చికిత్స
- ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం

3



## అమెరికాపై భారత్ ప్రతీకారం తీర్చుకోవాలి

- సర్కారుకు శశిథరూర్ సూచన
- 50 శాతం సుంకాలు విధించడంపై దేశంలో భిన్నాభిప్రాయాలు
- శశిథరూర్ షాకింగ్ కామెంట్స్

3

అమెరికా సుంకాల పెంపుపై మోదీ

# తగ్గేదే లే

- భారత రైతుల ప్రయోజనాల విషయంలో మోదీ దృఢ నిశ్చయం
- అమెరికా 50 శాతం వరకు సుంకాలు పెంచిన నిర్ణయం
- రష్యా చమురు కొనుగోలుతో అమెరికా అసహనం
- స్వామినాథన్ జయంతిలో మోదీ పరోక్ష వ్యాఖ్యలు
- వాణిజ్య చర్చల విఫలం.. అమెరికా ఆగ్రహం కారణం
- జీఎంసీలు, సబ్సిడీలపై భారత్ సున్నిత వైఖరి
- చిన్న రైతుల జీవనోపాధిని కాపాడే నిబద్ధత
- సుంకాల భారం భారత టెక్స్టైల్, ఆక్వా రంగాలపై ప్రభావం

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కోపంతో అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాలు పెంచిన విషయం అందరికీ తెలిసిందే. ముందుగా 25 శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధించిన ఆయన తాజాగా మరో 25 శాతం పెంచి.. 50 శాతానికి ఫిక్స్ చేశారు. అయితే ఈ పరిణామాలపై భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాజాగా స్పందించారు. నేరుగా ఈ విషయం గురించి ప్రస్తావించకపోయినా.. పరోక్షంగానే అమెరికాకు సమాధానం చెప్పారు. రైతుల ప్రయోజనాలపై ఎప్పటికీ భారత్ రాజీపడే ప్రసక్తే లేదని అన్నారు. ఒకవేళ ఈ వైఖరి కారణంగా.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చినా, దేశ ప్రయోజనాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా తేల్చి చెప్పారు. దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ మధ్య ఐదు రౌండ్ల వాణిజ్య చర్చలు విఫలమైన తర్వాతే ట్రంప్.. భారత్‌పై సుంకాన్ని 50

గురించి పరోక్షంగా స్పందించారు. రైతుల సంక్షేమమే తమకు అత్యంత ప్రాధాన్యం అని రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎప్పటికీ రాజీపడమని వెల్లడించారు. రైతుల ప్రయోజనాలను కాపాడడానికి ఎంత పెద్ద మూల్యాన్ని అయినా చెల్లించేందుకు తాను సిద్ధమేనని ప్రకటించారు. భారత్-అమెరికా

## ఉప రాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

### నామినేషన్లు షురూ..!

- సెప్టెంబర్ 9న ఎన్నికలు, అదే రోజు ఓట్ల లెక్కింపు
- నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 తుది గడువు
- 25న నామినేషన్ల ఉపసంహరణ

9



జంతర్ మంతర్ వేదికగా

## గర్జించిన రేవంత్

### పీఎం మోదీకి సవాల్!

- బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి అనుమతి కోరిన కాంగ్రెస్
- గుజరాత్ వారికి బీసీ రిజర్వేషన్లపై కడుపుమంట ఎందుకన్న ప్రశ్న
- బీసీలకు42 శాతం రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ ఉద్యమం
- ధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్, భట్టి, మహేష్ గౌడ్, పొన్నం
- మోదీ బలహీనవర్గాలకు శత్రువుగా ప్రవర్తిస్తున్నారని రేవంత్ విమర్శ
- రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తారా లేదా రాజీనామా చేయాలని సవాల్
- బీజేపీ నేతలపై మండిపడ్డ సీఎం రేవంత్ రెడ్డి
- ఇండియా కూటమి, 100 మంది ఎంపీల మద్దతుతో ఢిల్లీ ధర్నా

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

రాష్ట్రంలో బీసీ లకు 42 శాతానికి రిజర్వేషన్ పెంచే బిల్లును వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఈరోజు కొత్త ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా చేపట్టారు. ఈ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరడానికి వారు అనుమతి కోరుతున్నారు. మోదీపై ధ్వజమెత్తిన రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల




నాగేశ్వరరావు, పార్టీ ఎంపీలు, ఆ పార్టీ జాతీయ నాయకులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ, బిజెపి నేతలు బిసి

## అక్రమాల పుట్ట!

ఒక సెగ్మెంట్‌లో లక్ష ఫేక్ ఓట్లు

- దొంగఓట్లపై రాహుల్ తీవ్ర విమర్శలు
- ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కు ఆరోపణలు
- జనాభాకంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయంటూ ఆరోపణ
- ఫేక్ ఓటర్లపై ఆధారాలు ఉన్నాయన్న రాహుల్
- ఓటర్ల పత్రాల్లో ఫోటో, ఇంటి నెంబర్లు గందరగోళం
- ఓటర్ల తండ్రుల పేర్లలో స్పష్టత లేని అక్షరాలు
- ఈసీ డేటా ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన రాహుల్

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఓటర్ల జాబితాలో లోపాలు ఉన్నాయని ప్రశ్నించిన ఆయన.. నకిలీ ఓట్లు పడుతున్నాయని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని జనాభా కంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, బీజేపీ మధ్య కుమ్మక్కు జరిగిందని ఆయన ఆరోపించారు. బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందని రాహుల్ ఆరోపించారు. రాహుల్ గాంధీ కొన్ని ఓటర్ల పత్రాలను ఉదహరిస్తూ వాటిలో ఉన్న లోపాలను పాయింటర్ల ద్వారా వివరించారు. అనేక ఓటర్ల పత్రాల్లో ఓటరు తండ్రి పేరులో అక్షరాలు అస్పష్టంగా, గందరగోళంగా ఉన్నాయని చూపించారు. చాలా ఓటరు పత్రాల్లో ఇంటి నంబరు సున్నా (0) అని ఉందని ఆయన అన్నారు. చాలా మంది ఓటర్ల పత్రాల్లో వారి ఫోటోలు లేవని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ లోపాలను చూపించి ఇది "ఓట్ల దొంగతనం" అని అభివర్ణించారు. చివరి 5 నెలల్లో ఎక్కువ మంది ఓటర్లను జాబితాలో చేర్చారని, ఎగ్జిట్ పోల్స్ ఒకలా, ఫలితాలు మరొకలా వచ్చాయని ఆయన ఆరోపించారు. దీని ద్వారా ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఆయన వాదించారు. మహారాష్ట్ర ఫలితాలపైనా అనుమానాలు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై అనుమానాలు ఉన్నాయని.. ఆ ఎన్నికల్లో ఈసీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. పోలింగ్ నాడు మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసీ అక్రమాలకు పాల్పడిందని.. పోలింగ్‌నాడు సాయంత్రం 5 గంటల తర్వాత మహారాష్ట్రలో భారీగా

## ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరు?

2

- ఫైనల్ చేసే బాధ్యత ఆ ఇద్దరిదే..మోదీ,నడ్డాకే బాధ్యతలు
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన భేటీలో ఏకగ్రీవ తీర్మానం
- ఆరోగ్య కారణాలతో జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన పదవి
- సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక, అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఎన్డీయే అభ్యర్థికే విజయావకాశాలు.. ఇప్పటికే మిత్రపక్షాల సంపూర్ణ మద్దతు

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) కీలక నిర్ణయం తీసుకుంది. తమ కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే పూర్తి అధికారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు అప్పగిస్తూ గురువారం నాడు ఏకగ్రీవంగా తీర్మానించింది.


రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ల సమావేశం జరిగింది. ఈ భేటీకి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్యసభాపక్ష నేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వివరాలను మీడియాకు వెల్లడించారు. "రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించే బాధ్యతను ప్రధాని మోదీ, జేపీ నడ్డాలకు అప్పగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం. వారు తీసుకునే నిర్ణయానికి ఎన్డీయేలోని భాగస్వామ్య పక్షాలన్నీ కట్టుబడి ఉంటాయి," అని ఆయన స్పష్టం చేశారు.

భారత్‌కు

## పుతిన్ రాక

- రష్యాతో బలపడుతున్న భారత్ సంబంధాలు
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్..
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం
- భారత్‌పై ట్రంప్ 50% సుంకాలు విధించిన నేపథ్యంలో భారత్-రష్యా మధ్య కీలక అంశాలపై చర్చ

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపాలంటే రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టాలని భావించిన ట్రంప్ ఈ మేరకు పుతిన్ మిత్ర దేశాలపై కన్నెర్ర చేస్తున్నారు. అందులో భాగంగానే రష్యా నుంచి చమురు, ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై ట్రంప్ భారీగా సుంకాలను పెంచారు. ఈ క్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం అయ్యారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న దోభాల్.. ఈమేరకు పుతిన్‌తో భేటీ అయ్యారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన సమయంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య ఎనర్జీ, రక్షణ

## జస్టిస్ యశ్వంత్ వర్మకు బిగ్ షాక్!

- యశ్వంత్ వర్మ వేసిన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం
- నోట్ల కట్టల వ్యవహారంలో త్రిసభ్య కమిటీ
- నియామకం సబబేనని సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

నోట్ల కట్టల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఆయన వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. నోట్ల కట్టల వ్యవహారంపై త్రిసభ్య కమిటీ నియామకం సబబేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

నోట్ల కట్టల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఆయన వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. నోట్ల కట్టల వ్యవహారంపై త్రిసభ్య కమిటీ నియామకం సబబేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు విస్పష్టమైన తీర్పునిచ్చింది. జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. కాగా, తన ఇంట్లో లభించిన నోట్ల కట్టల వ్యవహారంపై విచారణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడాన్ని జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్

## రాజ్‌గోపాల్‌రెడ్డిపై హైకమాండ్ సీరియస్?

- రాజగోపాల్ రెడ్డిపై కాంగ్రెస్ హైకమాండ్ కీలక నిర్ణయం..!?
- వారంరోజుల నుంచి రాజగోపాల్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు
- సీఎం రేవంత్ లక్ష్యంగా రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు
- దీనిపై రాష్ట్ర ఇన్‌ఛార్జి నుంచి వివరాలు కోరిన హైకమాండ్
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవితో చర్చలు
- ముందుగా నోటీసులు జారీ చేయనున్న మల్లు రవి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో




కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొద్ది రోజులుగా రాజగోపాల్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు వివాదా స్పదంగా మారాయి. సీఎం రేవంత్ లక్ష్యం గా రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేయటం పైన పార్టీ హైకమాండ్ కు నివేదికలు వెళ్లాయి. వీటి పైన రాష్ట్ర ఇంఛార్జ్ నుంచి ఏఐసీసీ ఆరా తీసినట్లు తెలుస్తోంది. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి నేరుగా రాజగోపాల్ రెడ్డితో మాట్లాడాలని నిర్ణయించారు. ఆ తరువాత పార్టీ నిర్ణయం పైన స్పష్టత రానుంది. తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పదేపదే బహిరంగ విమర్శలు

## నగరాన్ని ముంచెత్తిన వాన

- రెండు గంటల పాటు కుండపోతగా వర్షం
- రోడ్లన్నీ జలమయం..ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్
- మునిగిన లోతట్టు ప్రాంతాలు..నిలిచిన నీరు
- ఇళ్లల్లోంచి ప్రజలు బయటకు రావొద్దన్న హైడ్రా
- హైడ్రా కమిషనర్‌కు ఫోన్ చేసిన సీఎం రేవంత్
- భారీ వర్షసూచనపై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

హైదరాబాద్: హైదరాబాద్ వ్యాప్తంగా వర్షం దంచికొడుతోంది. కుండపోత వర్షం కారణంగా నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, షేక్‌పేట్, మణికొండ, హైటెక్ సిటీతో పాటు ఎల్బీనగర్,హయత్‌నగర్,వనస్థలీపురం,ఉప్పల్,అంబర్‌పేట,దిల్‌సుఖ్‌నగర్,మలక్‌పేటలలో వాన జోరుగా కురిసింది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరో రెండు గంటలపాటు హైదరాబాద్‌లో భారీవర్షం కురిసే అవకాశం ఉందని హైడ్రా వెల్లడించింది. ప్రజలు రోడ్లపైకి రావొద్దని, లోతట్టు ప్రాంతాల వైపు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని హైడ్రా హెచ్చరికలు జారీ చేసింది.

మరోవైపు సీఎస్, డీజీపీ, హైడ్రా కమిషనర్ కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. భారీ వర్ష సూచనపై ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు సీఎం రేవంత్. విపత్తు నిర్వహణ బృందాలను సంసిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 2 రోజుల పాటు రాష్ట్రంలో విస్తారమైన వర్షాలు కురుస్తాయన్న సంకేతాల నేపథ్యంలో.. అన్ని శాఖల అధికారులతో పరిస్థితి సమీక్షించాలని జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో అర్ధరాత్రి వర్షాలు కారణంగా అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. హైదరాబాద్ లో ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక హైదరాబాద్ సిటీలో పెనుగాలులతో కుండపోత వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, హిమాయత్‌నగర్, లక్డీకపూల్, నాంపల్లి సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం నమోదవుతోంది. పంజాగుట్ట, ఎస్ఆర్

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్
శుక్రవారం
08 । ఆగస్టు । 2025





# దర్మస్థలలో ఉద్రిక్తత.. రిపోర్టర్‌పై దాడి



**బెంగళూరు-నవభూమి:** ధర్మస్థళ సమీపంలోని ఉజిరే వద్ద సువర్ణ చానల్ రిపోర్టర్‌తో పాటు ముగ్గురు యూట్యూబర్లపై స్థానికులు బుధవారం దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ధర్మస్థళలో 2012లో అనుమానాస్పదంగా మృతి చెందిన సౌజన్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బిగ్‌బాస్ ఫేం రజత్ వచ్చారు. నేత్రావతి నది సమీపంలో ఆయన యూట్యూబర్లతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతుండగానే 50 నుంచి 60 మంది స్థానికులు అక్కడికి చేరుకుని సువర్ణ చానల్ రిపోర్టర్‌తో పాటు యూట్యూబర్‌లతో వాగ్వాదానికి దిగారు. సౌజన్య అనుమానాస్పద మృతిపై పోరాడుతున్న మహేశ్ శెట్టి తిమరోడి, గిరీశ్ మట్టన్నతో పాటు వారి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి.. నలుగురినీ చితకబాదారు. అంతలోనే యూట్యూబర్లకు మద్దతుగా వంద మందికిపైగా యువకులు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలూ ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నాయి. గొడవ అంతకంతకూ పెరుగుతుండటంతో పోలీసులు లాఠీచార్జి చేశారు.

# పులివెందులలో మరో వివేకా తరహా హత్య కుట్ర ?

## అవినాష్‌పై సునీత సంచలనం..!

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**ఏపీలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ హంతకుల్ని పట్టుకోవడంలో సీబీఐ దారుణంగా విఫలమైంది. కొందరు నిందితుల్ని అరెస్టు చేసి జైలుకు పంపినా వారు కూడా బెయిల్ పై బయటకి వచ్చేశారు. ఈ నేపథ్యంలో వారి బెయిల్ రద్ద చేయాలంటూ సుప్రీంకోర్టును వివేకా కుమార్తె సునీతారెడ్డి ఆశ్రయించారు. దీంతో ఈ కేసులో దర్యాప్తు పూర్తయిందని సీబీఐ సుప్రీంకోర్టుకు చెప్పేసింది. ఈ నేపథ్యంలో కడప ఎస్పీని సునీతారెడ్డి దంపతులు కలిశారు. అనంతరం మాట్లాడిన సునీతారెడ్డి.. పులివెందులలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి వైఎస్ వివేకా హత్య తరహాలోనే మరో హత్యకు నిందితులు కుట్ర చేస్తున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిపై సునీత ఆరోపణలు చేశారు. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా తమ వర్గానికి చెందిన సురేశ్ పై అవినాష్ రెడ్డి అనుచరులు దాడి చేసి హతమార్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. పులివెందులలో తాజా పరిణామాలు చూస్తుంటే తన తండ్రి హత్యే గుర్తుకువస్తోందని సునీత ఆరోపించారు. అప్పట్లో గొడ్డలి పోటుతో వివేకా చనిపోతే గుండెపోటు అని చెప్పారని గుర్తుచేశారు. అప్పట్లో క్రైమ్ సీన్ తుడిచేయడంతో పాటు టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, సతీష్ రెడ్డి, బీటెక్ రవే నిందితులంటూ సంతకాలు చేయమన్నారని, కానీ తాము అందుకు అంగీకరించలేదని తెలిపారు. ఇప్పుడు కూడా అలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు సునీతారెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా తన తండ్రి హత్యపై పోరాటం చేస్తున్నా ఇప్పటివరకూ దోషులకు శిక్ష పడలేదన్నారు. దీనికి తోడు వివేకాను తాను, తన భర్త కలిసి హత్య చేయించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పు చేసిన వారికి మాత్రం శిక్ష పడాల్సిందేనన్నారు. తాజా పరిణామాలపై ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు సునీత వెల్లడించారు.

# గోవాలో ఆ పని చేస్తే రూ.3 లక్షలు ఫైన్..!

## అశోక్ గజపతిరాజు ఎఫెక్ట్ మొదలు

**పనాజీ-నవభూమి:** ఏపీలో సుదీర్ఘకాలం పాటు రాజకీయాలు చేసి తాజాగా గోవా గవర్నర్ గా ఎంపికైన అశోక్ గజపతిరాజు తాజాగా ఆ బాధ్యతలు చేపట్టారు. వచ్చీ రాగానే గోవాపై తనదైన ముద్ర వేసేందుకు అక్కడి ప్రభుత్వంతో కలిసి ఆయన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గోవా మంత్రివర్గం తాజాగా కేబినెట్ భేటీలో ఓ కీలక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వస్తే కచ్చితంగా రాష్ట్రంలో మార్పు కనిపించబోతోంది. చిన్న రాష్ట్రమైన గోవాలో ప్రస్తుతం జనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోయటం. దీంతో సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఇప్పటికే సోషల్ మీడియాతో పాటు బహిరంగంగా కూడా అక్కడి ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన అశోక్ గజపతిరాజు చొరవ చూపినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ చెత్త సమస్యపై తగు చర్యలు తీసుకోవాలని రాజు గారు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం తాజా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో ఇకపై చెత్త పార బోస్తే తొలుత 200 జరిమానా విధిస్తామని రెండోసారి పట్టుబడితే మాత్రం 3 లక్షల వరకూ జరిమానా విధించేందుకు వీలుగా కొత్తగా చట్టంలో మార్పులు చేయబోతోంది. ఈ మార్పులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం గోవా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. వీటిలో కేబినెట్ ఆమోదించిన మార్పుల ప్రకారం గోవా నాన్ బయోగ్రేడబుల్ గార్బేజ్ చట్టానికి సవరణ బిల్లును ప్రవేశపెట్టబోతున్నారు. ఈ మేరకు సీఎం ప్రమోద్ సావంత్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు, జలవనరుల్లో చెత్త పారబోసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అలాగే పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలపై అక్కడి కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణ పెంచి జరిమానాలు విధించబోతోంది.

# షర్మిలపై ఫిర్యాదుల వేళ కాంగ్రెస్ హై కమాండ్ అనూహ్య నిర్ణయం

**విజయవాడ-నవభూమి:** ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార కూటమి పార్టీలు వైసీపీ లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నాయి. వైసీపీ సైతం కౌంటర్ రాజకీయం మొదలు పెట్టింది. పలువురు వైసీపీ నేతలు లిక్కర్ కేసులో అరెస్ట్ అయ్యారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధినాయకత్వం ఏపీ పైన ఫోకస్ చేసింది. పీసీసీ చీఫ్ షర్మిల పైన కొందరు నేతలు ఢిల్లీ లీడర్స్ కు ఫిర్యాదు చేసారు. ఈ సమయంలో పార్టీ కోసం ఏపీ కేంద్రంగా పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇది కాంగ్రెస్ భవిష్యత్ కు కీలకంగా మారనుంది. ఏపీ కాంగ్రెస్ లో ఆసక్తి కర రాజకీయం మొదలైంది. పీసీసీ చీఫ్ షర్మిల వ్యవహార శైలి పైన కొందరు పార్టీ నేతలు ఢిల్లీకి ఫిర్యాదు చేసారు. షర్మిల మార్పు ఖాయమనే ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ అధినాయకత్వం ఇదే సమయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో కాంగ్రెస్ బలోపేతం కోసం సీనియర్లను రంగంలోకి దించింది. ఏపి కాంగ్రెస్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ల ను నియమించారు. మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం.. మస్తాన్ వలిలకు ఈ బాధ్యతలు అప్పగించింది. ఇదే సమయంలో పార్టీ ముఖ్య నేతలు 25 మందితో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీని నియమించింది. ఏఐసిసి పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యులుగా మాణిక్యం ఠాగూర్, పీసీసీ చీఫ్ షర్మిల, రఘువీరా రెడ్డి, కె రాజు, పల్లం రాజు, గిడుగు రుద్రరాజు , జేడీ శీలం ,మస్తాన్ వలి, కెవి పి రామచంద్రరావు,చింతా మోహన్ , బాపిరాజు, హర్ష కుమార్, తులసి రెడ్డి, కిల్లి కృపారాణి తో సహ ఇతర నేతలు ఉన్నారు. %ాూఎజవతీఅంవఎవత్ ాశీషవతీవస ఎ: ాూఎజవతీఅంవఎవత్: 0:11 ాశ్రీంశీ =ఝం% మందు బాబులకు బంపరాఫర్ - మద్యం కొంటే ఇక, ప్రభుత్వం తాజా నిర్ణయం..!! అదే విధంగా 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి తరువాత తిరిగి కాంగ్రెస్ బలోపేతం పైన ఫోకస్ చేయాలని పీసీసీ చీఫ్ రష్మిలకు పార్టీ బాధ్యతలు అప్పగించింది. అయితే, షర్మిల ఆశించిన స్థాయిలో పని చేయటం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. పార్టీలో సమన్వయం లోపించిందని ఢిల్లీ నేతలకు కొందరు ఫిర్యాదు చేసారు.

# నగరాన్ని ముంచెత్తిన వాన

**(1వపేజీ తరువాయి)**నగర్, అమీర్‌పేట్, మాదపూర్, కొండాపూర్, బయోడైవర్సిటీ, ఐకియా సెంటర్, ఏఎంబీ, ఇనార్బిట్ మాల్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, హైటెక్‌సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఇదేందయ్యా ఇది.. బర్త్ సర్టిఫికెట్ అప్లయ్ చేస్తే డెత్ సర్టిఫికెట్ ఇచ్చిన్రు



**ఖమ్మం-నవభూమి:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండల ఎమ్మార్వో కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే.. అధికారులు నిర్లక్ష్యంగా మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) జారీ చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. గట్టుసింగారం గ్రామానికి చెందిన కదారి మాధవి అనే బాలిక తన బర్త్ సర్టిఫికెట్ కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది.

గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డుల్లో వివరాలు లభ్యం కాకపోవడంతో.. ఆమె తల్లి మమతతో కలిసి ఆగస్టు 4న కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసింది. దరఖాస్తును పరిశీలించిన అధికారులు సర్టిఫికెట్ సిద్ధం చేసి కార్యాలయ ముద్ర వేసి వారికి అందజేశారు. అయితే మాధవి తల్లి సర్టిఫికెట్‌ను పరిశీలించగా.. అందులో బర్త్ సర్టిఫికెట్‌కు బదులు మరణ ధ్రువీకరణ పత్రం ఉన్నట్లు గమనించింది. అది చూసి ఖంగుతున్న మమత వెంటనే అధికారి వద్దకు వెళ్లింది.డెత్ సర్టిఫికెట్ జారీ చేయటంపై ఆమె సదరు అధికారిని ప్రశ్నించగా.. ఆ అధికారి ఆమె చేతిలో నుంచి సర్టిఫికెట్‌ను లాక్కుని చించేశారు. ఆ తర్వాత కంప్యూటర్‌లో సవరణలు చేసి కొత్తగా బర్త్ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. అయితే, ఆ కొత్త సర్టిఫికెట్‌లో కూడా సరైన వివరాలు నమోదు చేయలేదు. సరైన వివరాలు నమోదు చేయాలని బాలిక తల్లి కోరగా.. సంబంధిత రెవెన్యూ అధికారి ఆమెతో దురుసుగా ప్రవర్తించారని బాధితులు ఆరోపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, ఇష్టానుసారంగా మాట్లాడారని మమత ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ రకమైన నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనవసరమైన ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

# జంతర్ మంతర్ వేదికగా గర్జించిన రేవంత్

**(1వపేజీ తరువాయి)**రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాల కు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గల్లీలో ఉండలేక ఢిల్లీలో తేల్చుకుందామని చలో ఢిల్లీ తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపు మంట ఎందుకని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గల్లీలో ఉండలేక ఢిల్లీలో తేల్చుకుందామని చలో ఢిల్లీ చేపట్టామని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధించి తీరుతామని చెప్పారు. ఢిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయని, ఇప్పటికైనా మోదీ బీసీ రిజర్వేషన్ల బిల్లు విషయంలో అడ్డుకోకుండా ఉంటే మంచిదని హితవు పలికారు. మీకా అధికారం ఎవరిచ్చారు? ఇక బీసీ రిజర్వేషన్ల కోసం నాలుగు కోట్ల మంది ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి జంతర్ మంతర్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు. డిమాండ్ ఆమోదిస్తారా మిమ్మల్ని గద్దె దించాలా అంటూ ప్రశ్నించారు. మా ఆలోచనలను మా బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు అంటూ రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన మోదీకి లేదు మోదీ మన బద్ధ శత్రువు అని పేర్కొన్న రేవంత్ రెడ్డి బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదన్నారు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావు సైతం బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. తెలంగాణ లో బలహీనవర్గాల ఓట్లు అడుగుతున్న వీరంతా ఏం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. టిఆర్ఎస్ కు తెలంగాణలో పేగుబంధం కూడా తెగిందా? ఇక పేరు బంధం తెగిన టిఆర్ఎస్ కు, తెలంగాణలో పేగుబంధం కూడా తెగిందా అంటూ ప్రశ్నించారు.

ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా అంటూ నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం ఆపేది లేదని, కచ్చితంగా 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 100 హెక్టార్ల విస్తీర్ణంలో బంగారు నిక్షేపాలు

## ◆ జబల్‌పూర్‌లో భారీ ఎత్తున బంగారు గని లభ్యం



**ముంబై- నవభూమి:**తవ్వే కొద్దీ బంగారమే.. ఎక్కడో తెలుసా? ఇండియాలో గోల్డ్ కి ఉన్న డిమాండ్ గురించి ఎంత చెప్పినా తక్కువే.. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు బంగారం దుకాణాలు జనాలతో కళకళలాడుతూ ఉంటాయి. ఇండియాలో గోల్డ్ కి ఉన్న డిమాండ్ గురించి ఎంత చెప్పినా తక్కువే.. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు బంగారం దుకాణాలు జనాలతో కళకళలాడుతూ ఉంటాయి. అటు రష్యా అమెరికా వంటి దేశాలలో ఏర్పడిన ఉద్రిక్త వాతావరణం మరొకవైపు రూపాయి విలువ పడిపోవడం కారణంగా బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర లక్షకు పైమాటే. తప్పని పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయాల్సి వస్తోందని దీనివల్ల సామాన్యులపై మరింత భారం పడుతుందని పలువురు చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలను చూసి భయపడిపోతున్న ఎంతోమంది ప్రజలు ఎక్కడైనా గని ఉంటే వెళ్లి తవ్వుకుందాం అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ మాటలే నిజమవుతున్నాయని చెప్పవచ్చు. వాస్తవానికి భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, రాజస్థాన్ ,ఝార్కండ్ వంటి కొన్ని ప్రాంతాలలో బంగారు గనులు కూడా ఉన్నాయి.. కానీ ప్రత్యేకించి కొన్ని ప్రాంతాలలో మాత్రం తవ్వే కొద్దీ బయటపడేంత బంగారు గనులు ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు తాజా పరిశోధనలో తేల్చారు. పరిశోధనలో బయటపడిన విషయానికి వస్తే.. ఒక ప్రాంతంలో 100 హెక్టార్ల విస్తీర్ణంలో బంగారు గని ఉందని, అందులో తవ్వే కొద్దీ బంగారు నిక్షేపాలు బయటపడుతున్నాయని ఒక వార్త వెలుగు చూడడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అది ఎక్కడ ఉంది? అని తెలుసుకోవడానికి ప్రజలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జబల్‌పూర్ నగరంలో భూమిలోపల లక్షల టన్నుల బంగారం ఉందంటూ కొంతమంది శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. అక్కడ కొంతమంది సైంటిస్టులు పరిశోధనలు చేసిన తర్వాత.. అక్కడ వారు సేకరించిన కొన్ని నమూనాలను పరిశీలించడంతో బంగారు గనుల నిక్షేపాలు ఉన్నట్లుగా తేలిందని.. ఈ బంగారు గనులు సిహోరా తాలూకాలోని మహంగ్వా కేవల్రి ప్రాంతాలలో ఉన్నట్లుగా గుర్తించారు పరిశోధకులు. ఇప్పటికే జబల్‌పూర్ ప్రాంతం ఎక్కువగా మాంగనీస్, ఇనుము వంటి ఖనిజాలకు పెట్టింది పేరు. ఇప్పుడు కొత్తగా బంగారు నిక్షేపాలు ఉన్నాయని తేలడంతో జబల్‌పూర్ ప్రాంతం అధిక ప్రాధాన్యత సంతరించుకోవడమే కాకుండా ఇప్పుడు ఈ ప్రాంతంపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా ప్రత్యేకించి మరీ ఫోకస్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇకపోతే ఈ జబల్‌పూర్ నగరం సమీపంలోని మహంగ్వా కేవల్రి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు భౌగోళిక సర్వే ద్వారా సైంటిస్టులు తేల్చి చెప్పడంతో.. ఈ ఆవిష్కరణ జరిగిన తర్వాత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గణనీయంగా మార్చేందుకు ఇదే మంచి పరిణామం అని భావిస్తోంది. ఇక్కడ సుమారుగా 100 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ బంగారు గనులు విస్తరించి ఉన్నాయని , దీంతో పాటు రాగి, ఇతర విలువైన ఖనిజాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఉండే బంగారు నిక్షేపాలు దేశంలో బంగారు ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్ర పోషించే అవకాశం కూడా ఉంది అని చెప్పవచ్చు. ఇప్పుడు కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ లాంటి చారిత్రక గనులు గతంలో దేశ బంగారు ఉత్పత్తికి ఎంతో దోహదపడ్డాయి. ఇప్పుడు ఈ జబల్‌పూర్ గనులు కూడా భవిష్యత్తులో ముఖ్యమైన ఆర్థిక వనరుగా మారే అవకాశం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు.

పైగా ఇక్కడ వేలాదిమందికి ఉపాధి లభించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక ఈ ప్రాంతంలోని గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు కూడా మారబోతున్నాయని అక్కడి ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

# తెలంగాణలో అమిత్ షా పర్యటన షెడ్యూల్



**నిజామాబాద్-నవభూమి:** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. ఆదివారం నిజామాబాద్‌లో పలు కార్యక్రమాల్లో అమిత్ షా పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారైంది. అమిత్ షా పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

రేపు(ఆదివారం) ఉదయం 11:25లకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు అమిత్ షా చేరుకుంటారు. మధ్యాహ్నం 1:45కు బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లనున్నారు. అక్కడి నుంచి వినాయక్‌నగర్‌లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 2:30 వరకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలోనే ఆయన ఉండనున్నారు. 2:35కు నిజామాబాద్ కంటేశ్వర్ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు. 2: 45 నిమిషాల నుంచి 4గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో జరిగే కిసాన్ మహాసభలో అమిత్ షా పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టుకు అమిత్ షా చేరుకుంటారు.

# ఆర్టీసీలో త్వరలో 3,038 పోస్టుల భర్తీ: సజ్జనార్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఆర్టీసీలో త్వరలో 3,038 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడనున్నట్లు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ తరుణంలో ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు మోసగాళ్లు అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం యాజమాన్యం దృష్టికి వచ్చిందని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ అనుమతితో సంస్థలో పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభమైందని, ప్రభుత్వ నియామక బోర్డుల ద్వారా నోటిఫికేషన్ త్వరలో వెలువడనుందని వివరించారు. ఆర్టీసీలో ఉద్యోగాల పేరుతో ఎవరైనా సంప్రదిస్తే యాజమాన్యం దృష్టికి తేవాలని, లేదా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ తెలిపారు.

## కిషన్‌రెడ్డి కుట్రలు సాగనివ్వం: మంత్రి

**న్యూఢిల్లీ:** బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేస్తున్న కుట్రలను సాగనివ్వబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు బీజేపీ నేతలే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహా మంత్రివర్గమంతా అపాయింట్‌మెంట్ అడిగితే రాష్ట్రపతి ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రపతిని కలవకుండా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. శాసనసభలో మద్దతు తెలిపిన బీజేపీ.. ఢిల్లీలో ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. తెలంగాణలో ఒకలా, ఢిల్లీలో మరోలా.. ఇదేం ద్వంద్వ నీతి అని నిలదీశారు.

# తగ్గేదే లే

**(1వపేజీ తరువాయి)**రంగాలపై భారత దేశానికి సున్నితమైన వైఖరి ఉంది. భారత్‌లో వ్యవసాయం అనేది కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో నడిచే వ్యాపారంలా కాకుండా కోట్లాది మంది చిన్న రైతుల జీవనోపాధికి సంబంధించిన విషయంగా చూస్తోంది. మన దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉండడంతో.. చిన్న రైతులను కాపాడటానికి, ఆహార భద్రతను నిర్ధారించడానికి సుంకాలు తప్పనిసరి అని భారత్ వాదించింది.గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అమెరికా తీవ్రంగా ఆగ్రహించినట్లు తెలుస్తోంది. ఇది మాత్రమే కాకుండా భారత్.. రష్యాతో వ్యాపారం చేయడాన్ని కూడా యూఎస్ జీర్ణించుకోలేకపోతుంది. ముఖ్యంగా ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తున్న రష్యా వద్ద చమురు కొనుగోలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసింది. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. ముఖ్యంగా రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది.

# అక్రమాల పుట్ట!

**(1వపేజీ తరువాయి)**ఓటింగ్ జరిగిందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో జనం లేరని.. అయినా ఎలా సాధ్యమైందంటూ ప్రశ్నించారు. మహారాష్ట్ర ఓటరు జాబితాలో ఫేక్ ఓటర్లను చేర్చారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రశ్నలకు ఈసీ సరైన సమాధానాలు ఇవ్వడం లేదన్నారు. ఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ వద్ద ఆటం బాంబ్ లాంటి ఆధారాలు ఉన్నాయన్నారు. మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో 40 లక్షల మంది అనుమానాస్పద ఓటర్లు ఉన్నారని, దీనిపై ఎన్నికల సంఘం జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణం దొంగ ఓట్లేనని ఆయన ఆరోపించారు. ఓటర్ల జాబితా సరైనదా లేదా అనే విషయంపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. బీహార్‌లో లక్షల మంది ఓటర్లను తొలగించారని.. ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై అధ్యయనం చేశామని.. హర్యానా, మధ్యప్రదేశ్‌లో అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న చోట కూడా బీజేపీకి మాత్రమే ఇమ్యూనిటీ వస్తోందని పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కూడా తప్పుతున్నాయన్నారు. ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ డేటాను ఎందుకు ఇవ్వడం లేదని రాహుల్ ప్రశ్నించారు. తాము పదే పదే ఈ డేటా కోసం కోరినప్పటికీ, ఈసీ తమకు సమాధానం ఇవ్వడానికి కూడా నిరాకరించిందని ఆయన తెలిపారు. రాజ్యాంగానికి ఓటు హక్కు ప్రాథమికమని పేర్కొన్న రాహుల్ గాంధీ, సరైన వ్యక్తులకు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారా లేదా.. ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్లను చేర్చారా లేదా అనే ప్రశ్నలు లేవనెత్తారు.

# ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరు?

**(1వపేజీ తరువాయి)**ఆరోగ్య కారణాలను చూపుతూ జగ్‌దీప్ ధన్‌ఖడ్ జులై 21న అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. "ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, వైద్యుల సలహా మేరకు నేను భారత ఉపరాష్ట్రపతి పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను," అని తన రాజీనామా లేఖలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 21 నామినేషన్లకు చివరి తేదీ కాగా, సెప్టెంబర్ 9న పోలింగ్, ఓట్ల లెక్కింపు జరగనుంది. పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ ఉన్నందున, కూటమి బలపరిచిన అభ్యర్థి విజయం లాంఛనమే కానుంది. జేడీ(యూ), శివసేన, అప్నా దళ్ సహా పలు మిత్రపక్షాలు ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీజేపీకి బేషరతు మద్దతు ప్రకటించాయి.

# భారత్‌కు పుతిన్ రాక

**(1వపేజీ తరువాయి)**రంగాలపై చర్చించారు. ఓ వైపు భారత్, రష్యాలపై ట్రంప్ కారాలు మిరియాలు నూరుతుంటే ఈ భేటీ జరగడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే భారత్ పై 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. అంతే దూకుడుగా రష్యాకు అల్టిమేటం జారీ చేశారు. ఉక్రెయిన్ తో యుద్ధం ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని.. రష్యాపైన భారీ స్థాయిలో టారిఫ్ లు విధిస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఈ భేటీ ఎంతో ప్రాధాన్యతను చాటుకుందని చెప్పవచ్చు.

# జస్టిస్ యశ్వంత్ వర్మకు బిగ్ షాక్!

**(1వపేజీ తరువాయి)**చేశారు. అంతేకాదు.. తన అభిశంసనకు అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా చేసిన సిఫారసును కూడా జస్టిస్ యశ్వంత్ వర్మ తప్పుపట్టారు. ఎక్స్ పేరుతో జస్టిస్ యశ్వంత్ వర్మ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. ఇందులో లేవనెత్తిన అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు కావని ధర్మాసనం తేల్చి చెప్పింది.

# రాజ్‌గోపాల్‌రెడ్డిపై హైకమాండ్ సీరియస్?


**(1వపేజీ తరువాయి)**చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేయనుందని సమాచారం. తనకు మంత్రి పదవి ఇస్తానని పార్టీ హైకమాండ్ హామీ ఇచ్చిందని పలు మార్లు రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తన కంటే జూనియర్లకు మంత్రి పదవి ఇచ్చారని చెప్పుకొచ్చారు. అదే సమయంలో సీఎం రేవంత్ పైన చేసిన వ్యాఖ్యల పైన పార్టీలో చర్చ మొదలైంది. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి విషయంలో ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేసారు.

కాగా, ఈ విషయం పైన టీపీసీసీ క్రమిశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి రంగంలోకి దిగారు. మల్లు రవి తాజా వివాదం పై రాజగోపాల్ రెడ్డితో మాట్లాడనున్నారు. ఆయన స్పందనకు అనుగుణంగా నిర్ణయం తీసుకో నున్నారు. అయితే, ఒక దశలో రాజగోపాల్ రెడ్డికి నోటీసులు ఇవ్వనున్నారనే చర్చ పార్టీలో వినిపిస్తోంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజగోపాల్ రెడ్డితో మల్లు రవి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శల గురించి మల్లు రవి వివరణ కోరనున్నారు. ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యల వల్ల ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కి నష్టం కలుగుతోందని క్రమశిక్షణ కమిటీ భావిస్తోంది. పార్టీ పరువును దిగజార్చే విధంగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఈ భేటీ తర్వాత రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై క్రమశిక్షణ కమిటీ ఒక నిర్ణయానికి రానుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ శుక్రవారం 08 । ఆగస్టు । 2025

## నవజాతీయం

# స్పీకర్ సంచలన కామెంట్స్.. రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడుతున్న కేంద్రం





**చెన్నై-నవభూమి:** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డుకుని, లేనిపోని ఆటంకాలు సృష్టిస్తోందని శాసనసభ స్పీకర్ అప్పావుఆరోపించారు. తిరునల్వేలిలో గురువారం ఉదయం ఆ న మీడియాతో మాట్లాడుతూ.. దేశ విదేశీ వ్యవహారాల విధానం బలహీనమై పోయిందని, పహల్గామ్ దాడులకు సంబంధించి పాకిస్థాన్ను ప్రపంచ దేశాలలో ఖండించలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించినట్లు అన్నాడీఎంకే నేతలు ఆరోపిస్తున్నారని, తిరుప్పూరు వద్ద అన్నాడీఎంకే ఎమ్మెల్యేకి చెందిన తోటలో ఎస్సై దారుణహత్యకు గురయ్యారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నదెవరో ఈ సంఘటన రుజువు చేస్తుందన్నారు. కలైంజర్ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లును గవర్నర్ అంగీకరించకపోవడం విచారకరమని, కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారంభించే హక్కు రాష్ట్రానికి ఉందని, ఈ విషయం తెలిసినా గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపడం గర్హనీయమన్నారు.డీఎంకే ప్రభుత్వం దక్షిణాది జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ఆరోపించిన వారంతా విన్ఫాస్ట్ కార్ల కర్మాగారం ప్రారంభం, పెట్టుబడిదారుల సదస్సుల్లో పలు కంపెనీలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం చూసి విస్తుపోతున్నారన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రం 11.19 శాతం ఆర్థికాభివృద్ధి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని,

# 'పూరా ఖోల్ దియే పాషా' అంటూ అసదుద్దీన్ పోస్ట్.. స్పందించిన సిరాజ్..!



**హైదరాబాద్-నవభూమి:**ఇంగ్లాండ్తో టెస్ట్ సిరీస్లో అదరగొట్టిన టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సిరీస్లో ఒక్క టెస్టుకు కూడా రెస్ట్ తీసుకోకుండా.. వెయ్యికి పైగా బంతులేసిన ఈ హైదరాబాదీ పేసర్.. 23 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్గా నిలిచాడు. ఈ సిరీస్లో మొత్తంగా మహమ్మద్ సిరాజ్ ఒక్కడే 185.3 ఓవర్లు బౌలింగ్ చేయడం గమనార్హం. ఐదో టెస్టులో ఓ దశలో ఓడిపోయేలా కనిపించిన భారత్.. సిరాజ్ అద్భుత బౌలింగ్తో విజయం సాధించింది. సిరీస్ను 2-2తో సమం చేసుకుంది.

ఇక హైదరాబాద్కు చెందిన మహమ్మద్ సిరాజ్ను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనదైన శైలిలో ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. "ఎప్పుడూ విజేతే. మన హైదరాబాదీ స్టైల్లో చెప్పాలంటే పూరా ఖోల్ దియే పాషా" అని ఎక్స్లో పోస్ట్ చేశారు. పూరా ఖోల్ దియే పాషా అంటే.. సిరాజ్ అత్యుత్తమ ప్రదర్శన చేశాడని అర్థం.ఇక అసదుద్దీన్ ఓవైసీ ట్వీట్కు మహమ్మద్ సిరాజ్ కూడా స్పందించాడు. "థాంక్యూ సో మచ్ సర్.. ఎల్లప్పుడు నన్ను ప్రోత్సహిస్తూనే ఉంటారు" అని బదులిచ్చాడు. ఇక ఇంగ్లాండ్తో టెస్ట్ సిరీస్లో ప్రదర్శన ద్వారా.. మహమ్మద్ సిరాజ్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్లో తన స్థానాన్ని మెరుగు పర్చుకున్నాడు. ఏకంగా 12 స్థానాలు మెరుగుపర్చుకుని.. కెరీర్ బెస్ట్ అయిన 15వ ప్లేసుకు వచ్చాడు. 674 రేటింగ్ పాయింట్స్తో తన కెరీర్ బెస్ట్ నమోదు చేసుకున్నాడు. ఇంగ్లాండ్తో సిరీస్లో సిరాజ్ రెండు సార్లు ఫైఫర్ నమోదు చేశాడు. ఇక ఇంగ్లాండ్ పర్యటన ముగించిన స్వదేశానికి వచ్చిన టీమిండియా క్రికెటర్లకు ఘన స్వాగతం లభించింది. మహమ్మద్ సిరాజ్ సైతం.. తొలుత ముంబై విమానాశ్రయానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి మరో విమానంలో బుధవారం హైదరాబాద్కు వచ్చాడు. అతడి వెంట టీమిండియా ఫీల్డింగ్ కోచ్.. దిలీప్ కూడా ఉన్నాడు. హైదరాబాద్ ఎయిర్పోర్ట్లో సిరాజ్తో సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడ్డారు. దీంతో సిరాజ్.. చకచకా తాను కారులోకి ఎక్కి ఇంటికి వెళ్లిపోయాడు.

## విజయ్కాంత్ ఫొటో ఏ పార్టీ వాడకూడదు



**చెన్నై-నవభూమి:** డీఎండీకే వ్యవస్థాపకులు దివంగత విజయ్ కాంత్(ఫొటోను ఏ రాజకీయ పార్టీ వాడకూడదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత హెచ్చరించారు. జిల్లాస్థాయిలో డీఎండీకే బలోపేతం కోసం ప్రేమలత రాష్ట్రవ్యాప్త పర్యటన ప్రారంభించారు. బుధవారం వేలూరులో ఆమె మీడియాతో మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు విజయకాంత్ ఫొటోలు వాడకూడదని,ఎన్నికల సమయంలో కూటమి ఏర్పడినట్లయితే వాడుకోవడంలో తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. అయితే సినిమాలకు ఇది వర్తించదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, దీనిని సక్రమైన దారిలో తీసుకెళ్లడంలో ముఖ్యమంత్రి స్టాలిన్ విఫలమైయ్యారని ఆమె ఆరోపించారు.

## ప్రయాణికుడి అదృష్టం బాగుంది.. రైల్వే పోలీస్ లేకుంటే..



**ముంబై- నవభూమి:**ఈ మధ్య కాలంలో రైలు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోయాయి. మరీ ముఖ్యంగా ప్లాట్ ఫామ్ల దగ్గర చోటుచేసుకుంటున్న ప్రమాదాలు తారా స్థాయికి చేరాయి. రన్నింగ్లో ఉన్న రైలు ఎక్కి దిగబోయి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. చాలా సందర్భాల్లో రన్నింగ్లో ఉన్న రైలు ఎక్కబోయి.., రైలు, ప్లాట్ ఫామ్ మధ్యలో పడ్డవారిని తోటి ప్రయాణికులు, రైల్వే పోలీసులు ప్రాణాలు పోకుండా రక్షించారు. తాజాగా కూడా ఓ సంఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసు కారణంగా ఓ ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన మహారాష్ట్రలో మంగళవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ముంబైకి చెందిన ఓ వ్యక్తి మంగళవారం రాత్రి 11.50 గంటల సమయంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ పౌండ్కు వెళ్లాడు. లోకల్ ట్రైన్ కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. కొద్దిసేపటి తర్వాత రైలు రానే వచ్చింది. అయితే, రైలు ఆగి వెళ్లేంత వరకు అతడు లోపలికి ఎక్కలేదు. రన్నింగ్లో ఉన్న రైలులోకి ఎక్కే ప్రయత్నం చేశాడు. రైలులోకి ఎక్కుతుండగా పట్టుతప్పింది.రైలు కిందపడబోయాడు. అక్కడే ఉన్న రైల్వే పోలీసు ఇది గమనించాడు. క్షణాల్లో అతడ్ని పట్టుకుని పక్కకు లాగాడు. లేదంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. అతడి ప్రాణాలు రైలు కిందపడి పోయేవి. ఆ ప్రయాణికుడు.. చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీనిపై సీనియర్ రైల్వే అధికారి మాట్లాడుతూ.. 'మేము గనుక ఒక సెకన్ లేటు చేసి ఉన్నా.. ఆ వ్యక్తి రైలు కిందపడిపోయే వాడు. మా అధికారులు ఎంతో వేగంగా స్పందించారు. అతడ్ని కాపాడారు' అని అన్నారు.

## తగవు తీర్చేందుకు వెళ్లిన ఎస్ఐనే చంపేశారు




**చెన్నై-నవభూమి:** తండ్రీకొడుకుల మధ్య తగవు తీర్చేందుకు వెళ్లిన ఎస్ఐపై ఆ తండ్రీకొడుకులే ఎదురుతిరిగారు. తమ మధ్య ఎందుకు జోక్యం చేసుకుంటున్నావంటూ వేటకొడవలితో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చారు. తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. వివరాలిలీ.. మడత్తుకుళం అన్నాడీఎంకే ఎమ్మెల్యే మహేంద్రన్కు చెందిన మామిడితోటలో పనిచేస్తున్న తండ్రీకొడుకుల ఘర్షణ పడుతున్నారంటూ మంగళవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్లో ఉన్న అలంగియ దళవాయ్పట్టినం ప్రాంతానికి చెందిన స్పెషల్ ఎస్ఐ షణ్ముగవేల్ (57) డ్రైవర్ అళగురాజాను తీసుకుని హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. అక్కడ తోటలో పని చేసే మూర్తి, అతడి కుమారుడు తంగపాండ్యన్ తాగిన మైకంలో కర్రలతో కొట్టుకుంటూ కనిపించారు. ఈ ఘటనలో మూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరినీ షణ్ముగవేల్ విడదీసి.. మూర్తిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదే సమయంలో తంగపాండ్యన్ వేటకొడవలిలో షణ్ముగవేల్పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. మూర్తి సైతం తన కొడుక్కి అండగా నిలిచి, షణ్ముగవేల్పై దాడికి తెగబడ్డాడు. అడ్డుకునేందుకు యత్నించిన జీపు డ్రైవర్పైనా దాడిచేశారు. దీంతో అతడు పారిపోయి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న పోలీసు ఉన్నతాధికారులకు రక్తపుమడుగులో పడిఉన్న షణ్ముగవేల్ మృతదేహం కనిపించింది. తండ్రీకొడుకులు పారిపోయారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.ఎస్ఐను హతమార్చిన మూర్తి, అతడి కొడుకు తంగపాండ్యన్తోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మణికంఠన్ అనే మరో వ్యక్తి బుధవారం సాయంత్రం తిరుప్పూరు డీఎస్పీ కార్యాయంలో లొంగిపోయారు. ఎస్ఐ షణ్ముగవేల్ భౌతికకాయానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కాగా, ఎస్ఐ హత్య జరిగింది ప్రతిపక్ష అన్నాడీఎంకే ఎమ్మెల్యే తోట కావడంతో ఈ వ్యవహారంపై అధికార పార్టీ తీవ్రంగా స్పందించింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష పార్టీ ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతూ.. ఆ తప్పును తమపై వేసేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే ఆరోపించగా, సాక్షాత్తు పోలీసు అధికారే హత్యకు గురయ్యారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమేరకు ఉన్నాయో ప్రజలు గ్రహిస్తున్నారని అన్నాడీఎంకే దుయ్యబట్టింది. కాగా, షణ్ముగవేల్ హత్యకు గురికావటంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు.

## డ్రైవర్లకు విశ్రాంతి కోసం హైవేల పక్కన 5వేల ఎమినిటీ సెంటర్లు

**న్యూఢిల్లీ-నవనూమి:** జాతీయ రహదారులపై దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్ప్రెసవేల వెంబడి నూతనంగా రెస్ట్ స్టాప్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రతి 30-40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటయ్యే వీటిలో కారు, బస్సు ప్రయాణికులతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా సదుపాయాలు కల్పించనుంది.

# దొంగను పట్టించిన శివుడి టాటూ.. 48 గంటల్లోనే ఎంపీ గొలుసు చోరీ కేసు పరిష్కారం



**దిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో రెండ్రోజుల క్రితమే లోక్సభ ఎంపీ ఆర్. సుధా రామకృష్ణన్.. వాకింగ్ చేస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు దొంగిలించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఢిల్లీ పోలీసులు ఈ కేసును కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. ఎవరూ ఊహించని విధంగా నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. అలాగే ఎంపీ వద్ద నుంచి దొంగిలించిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 5 వేల సీసీ టీవీ కెమెరాలు పరిశీలించిన పోలీసులకు శివుడి టాటూ ఆధారం కీలకంగా మారింది. దాని ఆధారంగానే నిందితుడిని పట్టుకున్నారు. మరదెలా సాధ్యం అయిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి.సంఘటన వివరాల్లోకి వెళ్తే.. లోక్సభ సభ్యురాలు ఆర్. సుధా రామకృష్ణన్ తన సహచర ఎంపీ రాజాతితో కలిసి ఢిల్లీలోని చాణక్యపురిలో రెండ్రోజుల క్రితం ఉదయం వాకింగ్ చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో అనేక దేశాల రాయబార కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాసాలు ఉండటంతో భద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలోనే ఒక స్కూటర్పై వచ్చిన దుండగుడు ఎంపీ సుధా మెడలోని బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. ఈ సంఘటనతో ఆమె షాక్కు గురయ్యారు. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వెంటనే రంగంలోకి దిగారు. ఢిల్లీ పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని.. స్పెషల్ ఆపరేషన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోని 5,000కు పైగా సీసీటీవీ క్లిప్లను పరిశీలించారు. ఈ క్రమంలోనే చోరీ చేసిన నిందితుడు తన ముఖాన్ని హెల్మెట్తో కప్పుకున్నప్పటికీ.. ఒక దృశ్యంలో అతడి చేతిపై ఉన్న 'శివ టాటూ' కనిపించింది. పోలీసులు ఈ టాటూను, నిందితుడి విశిష్టమైన ముక్కు ఆకారాన్ని ప్రధాన ఆధారంగా తీసుకున్నారు. ఈ చిన్నపాటి ఆధారంతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఢిల్లీలో ఇలాంటి టాటూ ఉన్న పాత నేరస్థుల జాబితాను పరిశీలించారు. ఈక్రమంలోనే.. ఈ దొంగతనం చేసింది 60 ఏళ్ల సోహన్ రావత్ అని తేలింది. ఇతను ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియాకు చెందినవాడు. అలాగే పాత నేరస్థుడు. గతంలో ఇతడిపై 26 దొంగతనాలు, దోపిడీ కేసులు నమోదు అయ్యాయి. ఈ ఘటన జరిగినప్పుడు కూడా అతను బెయిల్పై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రావత్ను పట్టుకోవడానికి పోలీసులు అతడి విడిపోయిన భార్య, స్నేహితులను సంప్రదించారు. వారు తెలియకుండానే రావత్ మొబైల్ నంబర్ వివరాలు ఇచ్చారు. ఆ సమాచారం ఆధారంగా పోలీసులు అతడిని అరెస్ట్ చేసి విచారించారు. విచారణలో రావత్ నేరాన్ని అంగీకరించాడు. అలాగే దొంగిలించిన చైన్ను కూడా అప్పగించాడు.పోలీసులు అతడి నుంచి దొంగిలించిన బంగారు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన రెండు స్కూటర్లను స్వాదీనం చేసుకున్నారు. అలాగే మరోచోట చోరీ చేసిన 4 మొబైల్ ఫోన్లను కూడా గుర్తించారు. ఈ కేసులో 80 మందికి పైగా పోలీసు సిబ్బంది అహర్నిశలు శ్రమించి.. కేవలం 48 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ ఘటనతో ఢిల్లీలో వీఐపీలకు ఒక రకమైన భద్రత, సాధారణ ప్రజలకు మరో రకమైన భద్రత ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజల గొలుసు దొంగతనం కేసులు తక్కువ ప్రాధాన్యత పొందుతున్నాయని.. పరిష్కార నిష్పత్తి కూడా తక్కువగా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


# లోయలో పడిన సీఆర్పీఎఫ్ బస్సు, ముగ్గురు జవాన్లు మృతి



**ఉధంపూర్-నవభూమి:**జమ్మూ కాశ్మీర్లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. సుమారు 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న ఒక బస్సు లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో మరో 15 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. బసంత్గఢ్ ప్రాంతంలోని కాండ్వా సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ వార్త తెలిసిన వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన జవాన్లను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గురువారం రోజు ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. 187వ బెటాలియన్కు చెందిన సీఆర్పీఎఫ్ జవాన్లు బసంత్గఢ్ నుంచి ఒక ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతి చెందిన ఇద్దరు జవాన్లు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా.. మరో వ్యక్తి చికిత్స పొందుతూ మరణించారు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. మరో 14 మంది తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఇందులోనూ పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అలాగే మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.ఈ ఘటనపై జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశానికి సేవ చేస్తూ.. ప్రాణాలు కోల్పోయిన జవాన్ల సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూనే.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి, క్షతగాత్రులకు ఉత్తమ వైద్య సదుపాయాలు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు.మరోవైపు ఈ ప్రమాదంపై కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సైతం స్పందించారు. ఘటన పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఉధంపూర్ డిప్యూటీ కమిషనర్ సలోని రాయ్తో మాట్లాడి.. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెస్క్యూ ఆపరేషన్లో పాల్గొన్నారని వివరించారు.ఇలాంటి ప్రమాదాలు ఈ ప్రాంతంలో తరచుగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లోని రోడ్లు ఇరుకుగా ఉండటం, వాతావరణ పరిస్థితులు అస్థిరంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. బస్సు అదుపుతప్పడానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. టెర్రరిస్టుల కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తుంటాయి. ఈ క్రమంలో ఈ ప్రమాదం జరగడం చాలా విషాదకరం.

# అమెరికాపై భారత్ ప్రతీకారం తీర్చుకోవాలి

## సర్కారుకు శశిథరూర్ సూచన



**న్యూఢిల్లీ-నవనూమి:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడంపై దేశ వ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తుండగా.. తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ షాకింగ్ కామెంట్లు చేశారు. అమెరికా నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపడుతూనే.. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకోవాలని సూచించారు. అలా చేస్తే బాగుంటుందని చెబుతూ.. తన మనసులోని మాటను.. గురువారం రోజు పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. మరి ఆ సూచన ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందామా..?అమెరికా తమ దేశ వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల దాణా, చేపల ఉత్పత్తులు వంటి కీలక రంగాలకు భారత మార్కెట్లో ఎక్కువ ప్రాప్యత కల్పించాలని కోరుకుంటోంది. ఈ అంశంపై ఇరు దేశాల మధ్య ఐదు రౌండ్ల వాణిజ్య చర్చలు జరిగినప్పటికీ.. అవి విఫలం అయ్యాయి. ఈక్రమంలోనే ముందుగా 25 శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు పెంచిన ట్రంప్.. గురువారం రోజు మరో 25 శాతం ఎక్కువగా టారిఫ్ విధించారు. ఇలా ఇండియాపై మొత్తంగా అమెరికా 50 శాతం సుంకాలను వసూలు చేస్తోంది. ఇప్పటికే ఇవి అమల్లోకి కూడా వచ్చాయి.అయితే తాజాగా దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా పరోక్షంగా స్పందించారు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా రైతులు, పాడి రైతులు, మత్స్యకారుల జీవనోపాధిని రక్షించుకోవడానికి భారత్ ఎలాంటి రాజీపడదని తెలిపారు. ఎంత పెద్ద మొత్తంలో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చినా తాము వెనక్కి తగ్గే అవకాశమే లేదని అన్నారు. ఈక్రమంలోనే దేశవ్యాప్తంగా ఉన్న నేతలంతా ఈ అంశంపై స్పందిస్తూ.. తమ మనసులోని మాటలను వివరిస్తున్నారు. అయితే తాజాగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ దీనిపై స్పందించారు. ఈ విషయంలో మోదీ అభిప్రాయంతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు చెప్పారు.అమెరికా చర్యలకు భారత్ కచ్చితంగా గట్టిగా బదులివ్వాలని శశిథరూర్ వివరించారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ అదనపు సుంకాల నిర్ణయం భారత్కు రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగిస్తున్నందుకు ఒక రకంగా శిక్షగా భావించాలన్నారు. ఈ చర్యను అన్యాయం, అసంబద్ధం, సమర్థనీయం కానిదిగా శశి థరూర్ అభివర్ణించారు. అమెరికాలాగే భారత్ కూడా ప్రతీకార సుంకాలు విధించాలని.. ఆ దేశం ఎంత విధిస్తే మనం కూడా అంతే విధించాలని సూచించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తమ ఇంధన భద్రత కోసం అత్యవసరం అని భారత్ మొదటి నుంచి వాదిస్తోందని గుర్తు చేశారు.. స్వంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇలాంటి చర్యలు తీసుకోవడం తప్పేమీ కాదని స్పష్టం చేశారు.థరూర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తతలకు మరింత ఊతమిస్తున్నాయి. అమెరికా కేవలం తమ ప్రయోజనాలను మాత్రమే చూసుకుంటోందని.. భారత్ కూడా అదే విధంగా ఆలోచించాలని ఆయన నొక్కి చెప్పారు. అమెరికా విధించిన 25 శాతం అదనపు సుంకంపై భారత్ నిశ్శబ్దంగా ఉండకుండా దీటుగా స్పందించాలన్నారు. అమెరికాకు ఒక బలమైన సందేశం పంపాలంటే.. ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై భారత్ కూడా 50 శాతం సుంకాలు విధించడమే సరైన మార్గం తెలిపారు.

## అనాథ పిల్లల్లో ఎంతమందికి విద్యను నిరాకరించారు



**న్యూఢిల్లీ-నవనూమి:** అనాథ పిల్లలకు విద్యపై సుప్రీం కోర్టు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి పలు ఆదేశాలు జారీ చేసింది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009 కింద ఎంతమందికి చదువును నిరాకరించారో సర్వే చేసి గుర్తించాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. వచ్చే జనాభా లెక్కల్లో అనాథలను కూడా చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. అనాథల సంరక్షణ, రక్షణపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ఎంత మం ది అనాథ పిల్లలకు అడ్మిషన్లు కల్పించారు, అలాగే ఎంతమందికి నిరాకరించారు.. దానికి గల కారణాలేమిటి అనే దానిపై సర్వే చేయాలని రాష్ట్రాలకు ధర్మాసనం నిర్దేశించింది. సర్వే సందర్భంగా అర్హులైన పిల్లలను గుర్తిస్తే సమీ ప పాఠశాలల్లో చేర్చాలని చెప్పింది. ఈ వివరాలన్నింటితో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. తమ ఆదేశాలు అమలు చేయడానికి అధికారులకు 4 వారాల గడువు ఇచ్చింది. పాఠశాలల్లో బలహీనవర్గాలకు కేటాయించిన 25 శాతం కోటా సీట్లలో అనాథ పిల్లలకు కూడా స్థానం కల్పించాలంటూ నోటిఫికేషన్ జారీ చేసిన గుజరాత్, ఢిల్లీ, మేఘాలయ, సిక్కిం రాష్ట్రాలను ప్రస్తావి స్తూ.. అలాంటి నోటిఫికేషన్ ఇతర రాష్ట్రాలు కూడా ఇవ్వాలని బెంచ్ ఆదేశించింది.తదుపరి విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేసింది. వచ్చే జనాభా లెక్కల్లో అనాథలకు కూడా చోటు కల్పించేలా కేంద్రాన్ని ఆదేశించాలని విచారణ సందర్భంగా పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. జనాభా లెక్కల సందర్భంగా అనాథల కోసం కూడా ప్రత్యేక బాక్స్ ఉండాలని, అప్పుడు వారి డేటాను సులువుగా పొందవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో అనాథ పిల్లలు ఎంతమంది ఉన్నారో చెప్పే అధికారిక డేటా కూడా లేదన్నారు. యునిసెఫ్ లెక్కల ప్రకారం 2.5 కోట్ల మంది ఉన్నట్లు తెలుస్తోందన్నారు.

## వాట్సాప్లో స్కామ్ల నుంచి మరింత రక్షణ



**న్యూఢిల్లీ-నవనూమి:** ఫిషింగ్, మెసేజింగ్ స్కామ్ల నుంచి వాట్సాప్ వినియోగదారులకు రక్షణ కల్పించేలా మెటా కొత్త సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. 'సేఫ్టీ ఓవర్ వ్యూ' పేరుతో ప్రవేశపెట్టిన ఈ సౌకర్యం స్కామ్లకు కారణమయ్యే గ్రూప్ల సమాచారాన్ని ఆటోమేటిక్గా గ్రహించి వినియోగదారుడిని హెచ్చరిస్తుంది. వినియోగారుని కాంటాక్ట్ జాబితాలో లేని వారు ఎవరైనా వారిని వాట్సాప్ గ్రూప్లో యాడ్ చేస్తే వెంటనే కొత్త యాంటీ స్కామ్ టూల్ దానంతట అదే యాక్టివేట్ అవుతుంది. గ్రూప్లో యాడ్ చేసిన వ్యక్తి సమాచారాన్ని, గ్రూప్లో ఉన్న సభ్యుల సంఖ్యను, గ్రూప్ను సృష్టించిన వ్యక్తి సమాచారాన్ని, గ్రూప్ను క్రియేట్ చేసిన తేదీని తెలియచేస్తుంది. వివరాలన్నీ పరిశీలించిన వినియోగదారుడు గ్రూప్లో చేరాలా? వద్దా? నిర్ణయించుకోవచ్చు. కాగా, వ్యక్తులు పంపే స్కామ్ సందేశాల నుంచి రక్షణ కోసం నిరంతరాయంగా పనిచేస్తున్నట్లు మెటా పేర్కొంది. తాజాగా స్కామ్ కేంద్రాలతో లింక్ అయిన 68 లక్షల ఖాతాలను బాన్ చేసినట్లు వాట్సాప్ పేర్కొంది. కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న టెక్ దిగ్గజం కూడా వ్యక్తిగత స్కామ్ సందేశాల నుంచి రక్షణ ఇవ్వడం కోసం చిట్కాలను ఇస్తోంది. కొత్త వ్యక్తులు వాట్సాపలో చాట్ చేయడానికి ప్రయత్నించినపుడు స్పందించడానికి ముందు ఒక్క క్షణం ఆలోచించడం, ప్రశ్నించడం, సరిపోల్చుకోవడం ద్వారా స్కామ్ బారిన పడకుండా కాపాడుకోవచ్చుని ఆ టెక్ దిగ్గజం సూచించింది.

## కొత్త పైలట్ శిక్షణ వ్యవస్థపై భారత్ దృష్టి..

**న్యూఢిల్లీ-నవనూమి:** దేశంలో కొత్త తరహా పైలట్ శిక్షణ వ్యవస్థను తీసుకొచ్చే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. ప్రస్తుతం కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) వ్యవస్థ కొనసాగుతుండగా.. మల్టీ క్రూ పైలట్ లైసెన్స్ (ఎంపీఎల్) వ్యవస్థను కూడా పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తోంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఈ అంశంపై తన వాటాదారులతో బుధవారం సమావేశం నిర్వహించింది. ఒకవేళ దీనికి ఆమోదం లభిస్తే.. సీపీఎల్, ఎంపీఎల్ రెండూ అందుబాటులో ఉంటాయి. భద్రత, తమ అవసరాలను బట్టి ఆపరేటర్లకు ఈ రెండింటిలో శిక్షణ పొందిన వారిని ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం భారత్లో పైలట్ కావాలనుకునే వారు ముందుగా సీపీఎల్ చేయాలి. ఈ శిక్షణలో భాగంగా 200 గంటలపాటు విమానం నడిపిన అనుభవాన్ని గడించాలి. ఆ తర్వాత ఎయిర్బస్ ఏ320 లేదా బోయింగ్ 737 వంటి నిర్దిష్ట విమానాల్లో శిక్షణ పొందాలి. మరోవైపు ఎంపీఎల్ శిక్షణ తీసుకునేవారు దాదాపు 70 గంటలపాటు చిన్న శిక్షణ విమానం నడపాల్సి ఉంటుంది. ఆ తర్వాత పెద్ద విమానాల్లో 140 నుంచి 160 గంటలపాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది. తదనంతరం విమానయాన సంస్థలు వారిని ట్రైనీ పైలట్లుగా చేర్చుకుంటాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
శుక్రవారం
08 । ఆగస్టు । 2025



# విమానాశ్రయాలకు ఉగ్ర ముప్పు..



న్యూఢిల్లీ-నవభూమి: విమానాశ్రయాల భద్రతకు ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో కేంద్ర పౌరవిమానయాన భద్రత బ్యూరో (బీసీఏఎస్) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ మధ్య ఎయిర్‌పోర్టులపై ఉగ్రవాదులు లేదా సంఘ విద్రోహ శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో అన్ని విమానాశ్రయాల్లో తక్షణమే భద్రతను కట్టుదిట్టం చేయాలని పేర్కొంటూ బీసీఏఎస్ ఈ నెల 4న అడ్వైజరీ జారీచేసింది. విమానాశ్రయాలు, రన్‌వేలు, హెలిప్యాడ్‌లు, ఫ్లైయింగ్ స్కూల్స్, శిక్షణ సంస్థల్లో భద్రతను పెంచాలని అందులో ఆదేశించింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది టెర్మినల్, పార్కింగ్ ప్రాంతం, విమానాశ్రయ చుట్టపక్కల ప్రాంతాలు, ఇతర సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. స్థానిక పోలీసుల సాయంతో విమానాశ్రయాలకు వెళ్లే మార్గాల్లో తనిఖీలు చేపడుతున్నారు. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో పంపే పార్శిళ్లను నిశితంగా సోదా చేస్తున్నారు. విమానాశ్రయ సిబ్బంది, కాంట్రాక్టర్లతోపాటు విజిటర్లను కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. సీసీటీవీ ఫుటేజీలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విమానాశ్రయాల వద్ద ఎవరైనా వ్యక్తులు గానీ, వస్తువులు గానీ అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ను అప్రమత్తం చేయాలని బీసీఏఎస్ అడ్వైజరీలో పేర్కొంది. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్స్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అందులో సూచించింది.

## సభాపతికి గడువు ప్రజాస్వామ్యాన్ని రక్షించే న్యాయ తీర్పు

ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు పవిత్రమైనది. ప్రజలు ఓటు వేసి ఎంచుకునే ప్రతినిధులు తమ పార్టీ విధానాలపైనా, ప్రజల నమ్మకంపైనా విధేయత చూపాలని, వారి నిర్ణయాలు వ్యక్తిగత ప్రయోజనాల కన్నా ప్రజాభిప్రాయానికి లోబడి ఉండాలని రాజ్యాంగం స్పష్టం చేస్తుంది. కానీ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఒక పార్టీ నుంచి మరో పార్టీకి దూకడం అనేది ఈ ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర అవమానం. ఈ తరహా ఫిరాయింపులు "మరుగు మారిన నియమాల" కింద వర్ణించబడుతున్నా, ఇది నిజంగా ప్రజల విశ్వాసాన్ని విసర్జించడమే. ఈ వ్యవహారంలో శాసన సభాపతుల పాత్ర కీలకం. వారి నిర్లక్ష్యం వల్లే చాలామంది ఫిరాయించిన సభ్యులు ఏడాది దాటినా అనర్హత వేటుకు గురి కావడంలేదు. ఇలాంటి ఉదాసీన వ్యవస్థపై ఇప్పుడు సుప్రీంకోర్టు ఆక్షేపణలు, తీర్పు కొత్త దారులు చూపిస్తున్నాయి. శాసనసభల్లో ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సభాపతి మూడు నెలల కాల పరిమితిలో నిర్ణయం తీసుకోవాలని అనివార్యమైన గడువు విధించడమే ఈ తీర్పు ప్రత్యేకత. ఇది కేవలం న్యాయ పాఠమే కాక, ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తివంతమైన సూచన. తెలంగాణ తాజా రాజకీయ సంక్లిష్టతను పరిశీలిస్తే, గత శాసనసభ ఎన్నికల అనంతరం పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇది బహిరంగ ఫిరాయింపే అయినా, వారిపై సభాపతి ఇప్పటివరకు ఎలాంటి అనర్హత చర్యలు తీసుకోలేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించగా, నాలుగు వారాల్లో ప్రక్రియ ప్రారంభించాలన్న సూచన ఏకసభ్య ధర్మాసనం నుంచి వచ్చింది. అయితే ఆ ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్ ద్వారా నిలిపివేయించగలిగింది. 'సహేతుకమైన వ్యవధి' అనే భావనను ఆయా అధికారులు, పార్టీలు వ్యాసంగంగా వాడుకుంటూ వ్యవస్థను లంగిస్తున్నాయి. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ఈ తీర్పులో తీవ్రంగా ఖండించింది. ఇందులో విశేషంగా చర్చించదగిన అంశం సభాపతి నిర్ణయాలు న్యాయ పరిధిలోకి రావా అనే ప్రశ్నకు సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన సమాధానం. సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది ఫిరాయింపు అంశాలలో సభాపతి 'ట్రిబ్యునల్'గా వ్యవహరిస్తాడు కాబట్టి, అతని నిర్ణయం న్యాయ పరిశీలన పరిధిలోకి వస్తుంది. ఫలితంగా న్యాయ వ్యవస్థ, ప్రజల న్యాయాధికారాన్ని సమర్థంగా వినియోగించేందుకు ఇదే అత్యవసర సమయం. ఇటీవలి సుప్రీం తీర్పు మరో కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఎంత కాలం అనర్హత వేటుకు తప్పించుకోగలరన్న అనిశ్చితిని తొలగించింది. "మూడు నెలల్లోగా" అని స్పష్టమైన గడువు విధించడం ద్వారా, భవిష్యత్తులో ఇలాంటి కేసుల్లో సత్వర న్యాయాన్ని అందించాలన్న దిశగా న్యాయవ్యవస్థ కీలక మార్గదర్శకత్వాన్ని చూపింది. ఇప్పటికే ఒక సంవత్సరం దాటినా తాత్సారంగా వ్యవహరించిన శాసనవ్యవస్థపై ఈ తీర్పు గట్టిగా తిడినట్లయింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు గంభీరంగా తీసుకోవాల్సినవే. ఆయన శాసనసభ వేదికపైనే "ఉపఎన్నికలు రావు" అని రాజ్యాంగ పద్ధతులకు విరుద్ధంగా, నిబంధనలకు అవమానంగా మాట్లాడారు. ప్రజల నమ్మకాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా, రాజ్యాంగ వ్యవస్థల పట్ల కూడా తిరస్కార భావన ఉట్టిపడేలా ఆయన వ్యవహరించారు. దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీవ్ర వ్యాఖ్యలు ఎవరికి పాఠంగా నిలవాలి?..ఇక్కడే కాదు, కాంగ్రెస్ పార్టీ దాని చరిత్రకే వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. అప్పట్లో ఫిరాయింపులను నిరోధించేందుకు రాజీవ్ గాంధీ తేనిన 52వ రాజ్యాంగ సవరణ ఇప్పుడు తనయుడు రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల క్షేత్రస్థాయిలో తూట్లు పొడుస్తున్నది. రాహుల్ గాంధీ రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకుని నైతిక విలువల బోధన చేస్తూ తిరుగుతున్నప్పుడు, తండ్రి తీసుకొచ్చిన చట్టాన్ని పాటించాల్సిన బాధ్యత కూడా ఆయనపైనా ఉంది.

నిజానికి, ఈ మొత్తం వ్యవహారం ప్రజాస్వామ్య పరిరక్షణకు పరీక్షాస్థితిని సృష్టిస్తోంది. న్యాయస్థానం తన పాత్రను నిబద్ధతతో నిర్వర్తించింది. ఇప్పుడు మిగిలింది శాసనసభాపతి తన బాధ్యతను పూర్తి నైతికతతో నిర్వర్తించడం మాత్రమే. ప్రజలు ఎవరిని ఎన్నుకున్నారో, వారే వారి ఎమ్మెల్యేలు. మధ్యలో పార్టీ మారినవారు, ప్రజల అభిమతానికి అవమానకారులు. అలాంటి వారిపై తక్షణమే అనర్హత వేటు వేయాల్సిన బాధ్యత ఇప్పుడు సభాపతిపై ఉంది. సుప్రీంకోర్టు తన తీర్పుతో కేవలం రాజ్యాంగ పాఠమే కాక, ప్రజా విశ్వాసానికి బలమైన మద్దతునిచ్చింది. 'మూడు నెలల గడువు' నిబంధనను దాటితే, ప్రజల ఓటుకు చేసిన అవమానం మరింత తీవ్రంగా మారుతుంది. అందువల్ల, గీతదాటి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై తక్షణ చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడే ప్రజలు, వారి ఓటు విలువ, రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం చాటుతారు. లేకపోతే ప్రజల ఓటు మౌలిక హక్కుగా కాక, ఒక భోధక వ్యవస్థలోని విలువ కోల్పోయిన పత్రికాగడిపే ప్రమాదం ఉంది.

# ఇజ్రాయెల్‌లో యుద్ధ వ్యతిరేకత: గాజా నరమేధంపై బహిరంగ తిరుగుబాటు



ఇజ్రాయెల్ అంటేనే ఒక భద్రతా సంస్కృతి. దేశం చిన్నది కావచ్చు, కానీ నమ్మకమైన సైనిక వ్యవస్థ, గూఢచారి నెట్‌వర్క్, అత్యాధునిక ఆయుధ సామర్థ్యం వల్ల ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన దేశం. అయినా, అదే భద్రతా వ్యవస్థను నిర్మించిన వారు ు మాజీ మిలటరీ అధికారులు, మాజీ మోసాద్ చీఫ్‌లు, రిటైర్డ్ పోలీస్ ప్రధానులు, మాజీ ప్రధాని వరకూ ు ఇప్పుడు ఆ వ్యవస్థే గాజాలో జరుపుతున్న నరమేధాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇది ఒక చారిత్రక మలుపు. యుద్ధ భూమిలో అనుభవం ఉన్నవారు, ఇప్పుడు శాంతికి వాహకులవుతున్నారు.

ఈ వ్యాసం గాజా యుద్ధంపై విశ్లేషణ కాదు, నెతన్యాహూ పరిపాలనపై విమర్శ కాదు ు కానీ ఈ రెండు అంశాలు కలసి ఏర్పరుస్తున్న అంతర్గత అసంతృప్తిని, దానికి పాలనా యంత్రాంగం ఎలా స్పందిస్తున్నదనే విషయాన్ని విశ్లేషించడమే లక్ష్యం.

చచచ భద్రతా వ్యవస్థ నుంచి ప్రశ్నల వర్షం

2023 అక్టోబర్ 7న ప్రారంభమైన ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం 23 నెలలుగా కొనసాగుతున్నది. ఈ కాలంలో గాజా తలకిందులైంది. వందలాది భవనాలు నేలమట్టం అయ్యాయి. వేలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఐరాస నివేదికల ప్రకారం పౌర మృతులలో 40% కంటే ఎక్కువ మంది పిల్లలు. ఇది మానవతా సంక్షోభానికి రూపం.

ఈ సమయంలో 600మంది పైగా రిటైర్డ్ భద్రతాధికారులు ు అందులో మోసాద్ మాజీ చీఫ్‌లు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ మాజీ జనరళ్లు, పోలీసులు, రక్షణ మంత్రిత్వశాఖ మాజీ అధికారులు ు ఒక్కమాటగా యుద్ధానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఇలాంటి పెద్ద మొత్తంలో సైనికవర్గం నేరుగా రాజకీయ నాయకత్వాన్ని ప్రశ్నించడం అరుదైన సంఘటన.

అమెరికా అధ్యక్షుడికి లేఖ %-% అంతర్జాతీయ ఒత్తిడి ఈ రిటైర్డ్ అధికారుల గుంపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఓ బహిరంగ లేఖ రాశారు. "ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పునరావాస లక్ష్యాన్ని మర్చిపోయాడు. ఆయనకు ఇప్పుడు రాజకీయ జీవితాన్ని నిలబెట్టుకోవడమే ముఖ్యమైంది. ప్రజల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదు," అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇది కేవలం ఓ లేఖ కాదు. ఇది యుద్ధ వ్యతిరేకతకు అధికారిక ముఖం. ప్రపంచం ముందు ఇజ్రాయెల్‌లోని అంతర్గత గళాలను ప్రతినిధ్యం వహిస్తున్న ఓ రాజకీయ ప్రకటన. దీనితో పాటు వారు విడుదల చేసిన వీడియోలు, మీడియా మద్దతుతో ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పాలనపై విమర్శలు కొత్తేమీ కావు. ఆయన మీద కొన్నేళ్లుగా ముడుపుల కేసులు, అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వాటి విచారణలు వేగంగా సాగకుండా చేయడానికే ఆయన యుద్ధాన్ని లంగరుగా వాడుకుంటున్నారని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

యుద్ధాన్ని నిలిపివేస్తే తన ప్రభుత్వం కూలిపోతుందని, తద్వారా తనపై ఉన్న కేసులు మళ్లీ ముందుకు వస్తాయని నెతన్యాహూకు భయం అంటున్నారు విశ్లేషకులు. ఈ పరిణామాల నేపథ్యంలో, మాజీ అధికారులు విమర్శలతో కూడిన వీడియోలతో సహా, అమెరికాకు లేఖలు పంపడంలో అసలు ఉద్దేశం ఇదే అని అభిప్రాయపడే వర్గాలు కూడా ఉన్నాయి.

గాజా -నరకరూపం

ఈ యుద్ధంలో గాజా నగరం ఆవిరైపోయినట్లైంది. విద్యుత్ లేదే. నీరు లేకపోవడం సాధారణమే అయింది. ఆసుపత్రులన్నీ ధ్వంసమయ్యాయి. ఆహారం వుండదు. వైద్య సేవలు శూన్యం. ఓ వైపు హమాస్ పై దాడుల పేరిట విమానాల బాంబింగ్, మరోవైపు ఆహార పంపిణీ క్యూలైన్లపై కాల్పులు.

పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకూ ఆకలి చావులు ఎదుర్కొంటున్నారు. శరీరాన్ని ఎముకల గూళ్ళుగా మార్చిన బందీల విడియోలు బయటపడుతున్నాయి. ఇది చూసిన ఇజ్రాయెల్ ప్రజలు కూడా జల్లుమంటున్నారు. "బందీలను విడిపించాలంటే యుద్ధం అవసరం" అనే నెతన్యాహూ వాదనపై ప్రజల్లో నమ్మకం సడలిపోతోంది.

చచచ బందీల విముక్తి - జనం ఆశ, ప్రభుత్వం దురాశ

హమాస్ వద్ద ఇంకా 50 మంది ఇజ్రాయెలీ బందీలు ఉన్నట్లు సమాచారం. వారిలో 20 మంది సజీవంగా ఉండవచ్చని అంచనా. నెతన్యాహూ నేతృత్వంలో యుద్ధం పేరుతో హమాస్‌ను పూర్తిగా నాశనం చేస్తానని చెప్పినా, ఇప్పటి వరకు పూర్తిగా ఏ బందీని విడిపించలేకపోయిన వాస్తవం ప్రజల్లో అసహనాన్ని పెంచింది. ఇదే అసహనం యుద్ధ వ్యతిరేకతకు ప్రేరణ కలిగించింది. "బందీల ప్రాణాలకంటే పీఆర్వాలే ముఖ్యమా?" అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. చాలా కుటుంబాలు వీధుల్లోకి వచ్చి యుద్ధ విరమణ కోసం నినాదాలు చేస్తున్నాయి.

మాజీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల గాజా నగరాన్ని "ఒక అద్భుతమైన రిసార్టుగా మార్చాలి" అన్న ప్రసంగం చేశారు. ఇది ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసింది. గాజా ప్రజలు ఆకలితో చచ్చిపోతుంటే, ఇలాంటి వ్యాఖ్యలు మానవతా దృష్టికోణానికి భిన్నంగా ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తాయి.

ట్రంప్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందం 60 రోజుల పాటు అమలు కావాలంటే, బందీల విడుదల, హమాస్ ఆయుధాల అప్పగింత వంటి షరతులు ఉండాలన్న నెతన్యాహూ వైఖరి వల్ల చర్చలు ముందుకు సాగడం లేదు. హమాస్ మాత్రం తాము పాలస్తీనా రాజ్యాన్ని డిమాండ్ చేస్తూ తిరిగి సవాళ్లు విసురుతున్నది.

చచచ ప్రతిష్ఠంభన, పాలన అప్రజాస్వామికత

ప్రస్తుతం గాజాలో ఒక పెద్ద ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఇజ్రాయెల్ వెనక్కి తగ్గదని స్పష్టం చేస్తోంది. హమాస్ కూడా తన డిమాండ్ల నుండి తగ్గడం లేదు. మిడిల్ ఈస్ట్ వ్యాప్తంగా పాలస్తీనా మద్దతుదారుల ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా యుద్ధానికి వ్యతిరేకంగా విపరీత ఒత్తిడి పెరుగుతున్నది.

అయితే నెతన్యాహూ మాత్రం "ఇది సమరం కాదు, ఉనికికోసం పోరాటం" అని తేల్చేస్తున్నాడు. గాజాలో ఆకలితో చచ్చే వారి జీవితాలను అప్రయోజనంగా చూస్తూ, న్యాయబద్ధత పేరిట మరింత కఠినంగా వ్యవహరిస్తున్నాడు.

ఈ దీర్ఘ యుద్ధంలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ బలగాలే మానసికంగా క్షీణిస్తున్నాయి. మునుపటి ఉత్సాహం తగ్గిపోయింది. "మేము ఎందుకు పోరాడుతున్నాం?" అనే ప్రశ్న ఆ బలగాల్లోకి చొచ్చుకుపోయినట్లు తెలుస్తోంది. చనిపోయిన సహచరుల జాబితా పెరుగుతుండటం, గాజా మీద అనుభవించే గ్లోబల్ ద్వేషం, అంతర్గత అస్పష్టతలు ు ఇవన్నీ సైనికులలో విముఖతను పెంచుతున్నాయి.

చచచ ముగింపు: యుద్ధానికి ప్రజాస్వామ్యంలో శాశ్వత స్థానం ఉండదు

నెతన్యాహూ చెప్పేలా ఇది ఇజ్రాయెల్ ఉనికికోసం పోరాటం కావచ్చు. కానీ, అదే ప్రజాస్వామ్యం, అదే దేశ సైనిక వ్యవస్థ నిర్మించిన నాయకులు, నేటి రాజకీయం చేస్తున్న అజ్ఞానవంతుల చేతిలో తమ దేశం మలినమవుతుందనిపించి యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇది కేవలం గాజా వ్యథ కాదు. ఇది రాజ్యాధికారం కోసం జరుగుతున్న మానవ విలయం. ఇజ్రాయెల్ తన చరిత్రను తానే కలుషితం చేసుకుంటున్న వేళ, లోపలి గళాలే గట్టి హెచ్చరిక ఇస్తున్నాయి ు "ప్రపంచం మనల్ని గమనిస్తోంది, మన పాపాలను లెక్క వేస్తోంది.' ఈ గళాలను నెతన్యాహూ వినకపోతే, నేడు గాజా నరమేధంగా మిగిలినట్లే, రేపు ఇజ్రాయెల్ ప్రజాస్వామ్య బౌద్ధికత కూడా శవమైపోతుంది. ఓ దేశం తన భద్రతాధికారుల మాట వినకపోతే, రక్షణ కూడా వ్యర్థమే. యుద్ధానికి ముగింపు అవసరం ు అది నెతన్యాహూ నిర్ణయం కాకపోయినా, ప్రజాస్వామ్య ఒత్తిడితో తప్పనిసరిగా రానుంది.

# శిబూ సోరెన్ ఆదివాసీ ఆత్మగౌరవ ఉద్యమానికి మూలస్థంభం



భారత దేశ చరిత్రలో ఆదివాసుల స్వాభిమానాన్ని, వారి భూమి హక్కులను, వారి జీవనపద్ధతిని కాపాడేందుకు శ్రామికుల నుండి పార్లమెంటు వరకూ పోరాడినవారెందరో. అయితే అందరిలోకీ శిఖరంలాంటి వ్యక్తి ఎవరో అంటే, అది "దిశోం గురు"గా పేరుపొందిన శిబూ సోరెన్‌గానే చెప్పాలి. ఆయన సాధించిన ఝార?ండ్ రాష్ట్రం, ఆయన లాలన పాలనలో ఎదిగిన ఝార?ండ్ ముక్తి మోర్చా పార్టీ, ఆయన తిరుగుబాటుతో పెరిగిన ఆదివాసీ యువత ఇవన్నీ ఆయన పోరాట జీవితం ప్రతిబింబాలు.

శిబూ సోరెన్ 1944 మే 11న బీహార్‌లోని (ప్రస్తుతం ఝార?ండ్‌లో) రాంపూర్ హాటు గ్రామంలో ఓ నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించారు. అతను చిన్న వయస్సులోనే సామాజిక అసమానతలు చూశాడు. అతని తండ్రిని వడ్డీ వ్యాపారులు దారుణంగా హత్య చేసిన సంఘటన బాలశిబూలో తిరుగుబాటు విత్తనాలను నాటింది. అప్పటి నుంచి ఆయనకు పోరాటం జీవన మార్గంగా మారింది. ఈ హింసాత్మక అనుభవమే ఆయనను గిరిజనుల నాయకుడిగా తీర్చిదిద్దింది.

'ధాన్ కాటో' ఉద్యమం - ఉద్యమం కాదుసంచలనం

1960లలోనే ఆయన "ధాన్ కాటో" అనే వినూత్న ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇందులో గిరిజనులు తమ భూమిలో వరి కోత మొదలుపెట్టేవారు, భూమి దొంగల అనుసరణలను అడ్డుకునేం దుకు యువకులు విల్లు బాణాలతో హామీగా ఉండేవారు. ఇది కేవలం భూమి కోసం చేసే ఉద్యమం కాదు అది ఒక ఆత్మగౌరవ జ్వాల. ఇదే ఉద్యమం శిబూ సోరెన్‌ను ముసుగు ధరించిన నాయకుడిగా తీర్చిదిద్దింది.

1972లో శిబూ సోరెన్ "ఝార?ండ్ ముక్తి మోర్చా" పార్టీని స్థాపించారు. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు ఇది అడవివాసుల ఆకాంక్షలకు ప్రతిబింబం. ప్రత్యేక ఝార?ండ్ రాష్ట్ర స్థాపనకు, ఆదివాసీల భూముల పరిరక్షణకు, వారి జీవనశైలి కొనసాగించేందుకు ఇది ఓ రాజకీయ సాధనం. ఈ మోర్చా ద్వారా ఆయన ప్రాథమిక హక్కులు, భూమి హక్కులు, పంచాయితీ రాజ్ వ్యవస్థల్లో ఆదివాసీ భాగస్వామ్యం కోసం నడిచిన యుద్ధం దేశవ్యాప్తంగా ఆదరణ పొందింది. చచచచ లిలిపార్లమెంటు అడుగులు శిబూ జాతీయ నాయకుడిగా శిబూ సోరెన్ 1980లో మొదటిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. తరువాత మూడుసార్లు కేంద్ర మంత్రిగా పని చేశారు. 2004లో కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ మంత్రివర్గంలో బొగ్గు శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత యూపీఏ హయాంలోనూ కీలక పాత్ర పోషించారు. అయితే కేంద్రంలో మంత్రి పదవిలో ఉన్నప్పటికీ గిరిజన హక్కులపై రాజీకి సిద్ధం కాలేదు. అవసరమైతే రాజీనామా చేయడానికీ వెనుకాడలేదు. 2000లో షరతులు, పోరాటాలు, అనేక చర్చల అనంతరం శిబూ సోరెన్ కల అయిన ఝార?ండ్ రాష్ట్రం స్థాపించబడింది. ఇది కేవలం ఒక రాజకీయ విజయంగా కాదు, ఆదివాసీ చరిత్రలో ఓ తిరుగుబాటు ఘట్టంగా నిలిచింది. ఇది దేశ చరిత్రలో ఒక వేదనను, ఒక సంకల్పాన్ని రాజ్యంగా మార్చిన సంఘటనగా నిలిచిపోయింది. శిబూ సోరెన్ అనే వ్యక్తి అప్పటికే "దిశోం గురు"గా గిరిజనులకు మార్గదర్శిగా నిలిచిపోయారు.

శిబూ సోరెన్ జీవితంలో వివాదాలు కూడా ఉన్నాయి. ఓ హత్యా కేసులో ఆయనను అరెస్ట్ చేసి, జైలులో ఉంచిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. అయితే ఆయన మీదున్న నమ్మకంతో మళ్లీ ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. హక్కుల కోసం పోరాడే నాయకుడికి కేసులు సహజమని గిరిజనులు గర్వంతో చెబుతారు. ఆయనను రాజకీయంగా అణచేందుకు కుట్రలు జరిగాయని వారి అభిప్రాయం. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలోనూ శిబూ సోరెన్ పాత్ర మౌనంగా ఉండి పెద్దదే. ప్రత్యేక రాష్ట్రాల సాధనకు ఆయన ప్రేరణగా నిలిచారు. కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమానికి ఆయన మద్దతు ప్రకటించారు. కరీంనగర్ సింహగర్జన సభకు హాజరై మాట్లాడిన ఆయన మాటలు ఉద్యమాన్ని ఉత్తేజపరిచాయి. తాను ఎలా పోరాడి ఝార?ండ్ సాధించాడో, అలాగే తెలంగాణ యువతా పోరాటం ద్వారా సాధించుకోవచ్చని ఆయన ఉత్సాహాన్నిచ్చారు.

శిబూ సోరెన్ జీవితం ఒక ఉద్యమ గ్రంథం. ఆయన రాజకీయ జీవితాన్ని, ఉద్యమ మార్గాన్ని అధ్యయనం చేస్తే ఆదివాసీ ఉద్యమం ఎలా నడవాలి, ఉద్యమ నాయకుడు ఎలా ఉండాలి అన్నది అర్థమవుతుంది. నైతిక విలువలు, సంకల్ప బలము, రాజీపడని ధైర్యం కలగలసిన ఒక చరిత్ర పురుషుడు ఆయన.

ఈ కాలంలో అతివాదాలు, ఆత్మపరిత్యాగం, నిజాయితీ వంటి పదాలు మాయమవుతున్న వేళ, శిబూ సోరెన్ లాంటి నాయకులు ప్రజాస్వామ్యంలో విలువైన ఋషులు. ఆయన ఉద్యమ మార్గం దేశంలోని ప్రతి వంచిత వర్గానికి పాఠమవుతుంది. ఆయన మరణం ఒక వ్యక్తి మరణం కాదు - అది ఉద్యమ శక్తికి తీరని లోటు.

శిబూ సోరెన్ -ఓ ముద్రవేసిన నాయకుడు. ఓ మార్గదర్శకుని స్ఫూర్తి. ఆదివాసీ సంస్కృతికి పునాది. పోరాటానికి శబ్దమిచ్చిన గొంతు. భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన పేరు.

## వ్యాసాలు పంపండి

**నవభూమి తెలుగు దినపత్రిక ఎడిట్ పేజీకి వ్యాసాలు పంపండి. తప్పుల్లేకుండా, ఇంగ్లీష్ అక్షరాలు ఉపయోగించకుండా యూనికోడ్ ఫాంట్‌లో పంపాల్సి ఉంటుంది. ఒకే సారి నాలుగు పత్రికలకు పంపితే ప్రచురించబడవు. నవభూమి కోసమే ప్రత్యేకంగా రాసినవి అయితేనే ప్రచురిస్తాం. ఇతర పత్రికల్లో ప్రచురితమైతే రచయితను బ్లాక్‌లో పెడతాం-ఎడిటర్**

navabhoomi1@gmail.com

# వరలక్ష్మీదేవిని ఇలా అలంకరించాలి

భక్తి



వరలక్ష్మీవ్రతం రోజున మహిళలందరూ లక్ష్మీదేవి పూజ చేస్తూ ఉంటారు. కొంతమంది పటాన్ని పూజిస్తే మరికొంతమంది మాత్రం అమ్మవారే స్వయంగా వచ్చి కూర్చున్నట్లు ఏర్పాటు చేస్తారు. ఆ దేవికి పట్టుచీర, ఆభరణాలు, పూలు అలంకరించి మురిసిపోతుంటారు. పూజ చేసే ముందు అమ్మవారిని అందంగా ఎలా కొలువుదీర్చాలో తెలుసుకుందాం...

బజారు నుంచి అమ్మవారి ముఖం, చేతులు తెచ్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే బియ్యప్పిండితో తయారు చేసుకోవచ్చు.

ఇత్తడి లేదా రాగి చెంబును తీసుకోవాలి. దానికి పై భాగంలో ఒక కర్రను తాడుతో కట్టాలి.

అమ్మవారిని ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశంలో ఒక టేబుల్ లేదా పీట వేసి దాని మీద ఒక బిందె పెట్టాలి. దీనిమీద కర్ర కట్టిన చెంబును ఉంచాలి. కర్ర ముందువైపునకు ఉండేలా చూసుకోవాలి.

జరీ డిజైన్ ఉన్న జాకెట్ గుడ్డను తీసుకుని చిన్న చిన్న కుచ్చిళ్లతో మడతపెట్టాలి. రెండు చివరలా అలాగే మధ్య భాగంలో క్లిప్‌లు పెడితే కుచ్చిళ్లు విడిపోవు. ఇలా తయారుచేసుకున్న కుచ్చిళ్లను చెంబు వెనక నుంచి కర్ర మీదుగా ముందుకు వేలాడదీయాలి. చివరల ఉన్న క్లిప్పులను తీసివేసి కుచ్చిళ్లను గుండ్రంగా వచ్చేలా అందంగా సర్దాలి. ఈ కుచ్చిళ్లను మొదటి చెంబు పై భాగానికి కలుపుతూ లేస్ లేదా దారంతో గట్టిగా కట్టాలి. కర్ర మీద కుచ్చిళ్లను చక్కగా పరచాలి. తరవాత పొడవైన హారం, పెద్ద లాకెట్ ఉన్న నెక్లెస్ అమర్చాలి. నడుము భాగంలో ముత్యాల గొలుసు లేదా చిన్న నెక్లెస్‌ను వడ్డాణంలా పెట్టవచ్చు.

పై చెంబులో కొబ్బరికాయను పెట్టి దాని మీద అమ్మవారి ముఖాన్ని అమర్చాలి. కర్రకు ఇరువైపులా అమ్మవారి చేతులు పెట్టాలి. ఈ రెండు చేతులకూ గాజులు వేయాలి. తరవాత ఒక పెద్ద పూల దండను తీసుకుని తలపై నుంచి భుజాల మీదుగా వేలాడదీయాలి. ఒక కార్డ్ బోర్డును గుండ్రంగా కత్తిరించి దానికి బంగారు రంగులో మెరిసే కాగితాన్ని అంటించాలి. దీన్ని అమ్మవారి తల వెనక జాగ్రత్తగా అమర్చాలి. కొన్ని కాగితాలను గుండ్రంగా చుట్టి బంతి మాదిరి తయారు చేయాలి. ఇలా రెండు బంతులు తయారు చేసి మొదటి బిందెకు ఇరుపక్కలా కుచ్చిళ్ల కింద అమర్చాలి. ఇలా చేయడం వల్ల అమ్మవారు పీట మీద కూర్చున్న అనుభూతి కల్గుతుంది.

శ్రావణ శుక్రవారం సందర్భంగా జరిగే వరలక్ష్మీ వ్రతం రోజున మహిళలు లక్ష్మీదేవిని ఘనంగా అలంకరిస్తారు. పటాన్ని పూజించే వారి కన్నా, స్వయంగా అమ్మవారు కూర్చునట్లు అలంకరించి కొలిచే సంప్రదాయం మరింత ప్రాచుర్యం పొందుతోంది. ఇందుకోసం ముందుగా ఇత్తడి లేదా రాగి చెంబు తీసుకొని, దానిపై కర్రను తాడుతో బంధిస్తారు. ఈ చెంబును పీఠంపై ఉంచి, వెనుక నుంచి జరీ కుచ్చిళ్లతో పట్టు సీర కట్టినట్టు అలంకరిస్తారు. అనంతరం పొడవైన హారం, వడ్డాణం, ముత్యాల గొలుసులు వేసి, భుజాలపై పూలదండలు అలంకరిస్తారు. చెంబు పైభాగంలో కొబ్బరికాయను పెట్టి, దానిపై అమ్మవారి ముఖాన్ని అమర్చుతారు. కర్రకు ఇరువైపులా చేతులు, వాటికి గాజులు పెట్టడం, తల వెనుక బంగారు రంగు హాలోను అమర్చడం ప్రత్యేక ఆకర్షణ. చివరిగా బిందె పక్కలా రెండు బంతులా కాగితాలు అమర్చడం వల్ల అమ్మవారు పీఠంపై కూర్చున్నట్లే కనిపిస్తుంది. ఈ విధంగా శ్రద్ధతో చేసిన అలంకరణ అమ్మవారి అనుగ్రహాన్ని ఆకర్షిస్తుందని నమ్మకం.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 హైదరాబాద్ శుక్రవారం 08 । ఆగస్టు । 2025

## నవ విశ్వం



### డేంజర్ మార్క్‌ను దాటిన యమునా నది ప్రవాహం.. ఆందోళనలో ఢిల్లీ వాసులు



న్యూఢిల్లీ-నవభూమి: ఢిల్లీ లో యమునా నది నీటి ప్రవాహం డేంజర్ మార్క్ ను దాటింది. గత కొన్ని రోజులుగా ఢిల్లీకి ఎగువన ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు యమునా నదికి వరద పోటెత్తుతోంది. పాత రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటిమట్టం 204.50 మీటర్ల ప్రమాద స్థాయిని దాటింది. గురువారం ఉదయం 8 గంటల సమయానికి నదిలో నీటి మట్టం 204.88 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు. నదిలో నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి ప్రతి గంటకు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయడం వల్ల యమునా నదిలో ప్రవాహం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయానికి గరిష్ఠంగా 61 వేల క్యూసెక్కుల నీరు యమునా నదికి వచ్చి చేరినట్లు పేర్కొన్నారు. యమునా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరడంతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఓ సారి యమునా నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహించడంతో రాజధాని ప్రాంతం నీట మునిగిన విషయం తెలిసిందే.

## బ్రిటిష్ కాలం నాటి స్లోచ్ హ్యాట్స్ స్థానంలో తెలంగాణ స్టయిల్ పీక్ క్యాప్స్..!



బెంగళూరు-నవభూమి: కర్ణాటక పోలీసులు తమ తలపై ధరించే టోపీలు మారనున్నాయి. ప్రస్తుతం కర్ణాటక పోలీసులు ధరిస్తున్న బ్రిటిష్ కాలం నాటి స్లోచ్ హ్యాట్స్ స్థానంలో తెలంగాణ స్టయిల్ నేవీ బ్లూ పీక్ క్యాప్స్ ను తీసుకురానున్నారు. ఈ నేవీ బ్లూ క్యాప్స్ కంఫర్టుగా, ప్రయోజనకారిగా, మోడరన్ లుక్‌తో ఉంటుంది. ఈ కొత్త మోడల్ క్యాప్‌లకు కర్ణాటక ప్రభుత్వం ఆమోదం తెలిపింది.దాంతో ఇన్నాళ్లు బ్రిటిష్ కాలంనాటి స్లోచ్ హ్యాట్స్ ధరిస్తున్న కర్ణాటక కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు ఇప్పుడు తెలంగాణ పోలీస్ యూనిఫామ్‌ను ఆధారంగా చేసుకుని డిజైన్ చేసిన తెలంగాణ స్టయిల్ నేవీ బ్లూ పీక్ క్యాప్స్‌ను ధరించనున్నారు. కర్ణాటక ప్రభుత్వం సుదీర్ఘ మంతనాల అనంతరం ఈ డిజైన్‌కు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హోంమంత్రి పరమేశ్వర తదితరులు చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

## సొంత భర్తలకే రాఖీలు కడతారు.. ఎక్కడంటే?



ఛింద్వాడా-నవభూమి:సాధారణంగా రాఖీ పండుగ రోజు సోదరులు లేదా సోదరులుగా భావించే స్నేహితులకే కడుతుంటాం. తాత, నాన్న, బాబాయి, మామయ్య.. ఇలా ఇతరులకు కూడా కట్టుంటారు చాలా మంది. అయితే సొంత అన్నాతమ్ముళ్లకు కట్టిన తర్వాతే మిగతా వారికి రాఖీలు కట్టుంటారు. ఇదంతా మనకు తెలిసిందే. కానీ ఓ చోట మాత్రం సొంత సోదరులను విడిచి పెట్టి.. తన మెడలో మూడు ముళ్లు వేసిన సొంత భర్తకే రాఖీ కట్టుంటారు. ఇదేంటీ అని ఆశ్చర్యపోతున్నారా.. అవునండి. వాళ్లు నిజంగానే భర్తలకు మాత్రమే రాఖీలు కడతారు. ఏందుకు, ఎక్కడో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి.మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లాలో ఉన్న గోండు గిరిజన సమాజం తమ ప్రత్యేకమైన సంప్రదాయంతో.. దేశంలోని మిగిలిన ప్రాంతాల ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. భారతదేశం అంతటా రక్షాబంధన్ పండుగను సోదర ప్రేమకు ప్రతీకగా జరుపుకుంటారు. చెల్లెళ్లు, అక్కలు తమ అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టి, వారి నుంచి రక్షణ, ఆశీర్వాదాలను పొందుతారు. కానీ ఛింద్వాడా జిల్లాలోని గోండు తెగ మహిళలు ఈ సంప్రదాయానికి భిన్నంగా తమ భర్తలకే రాఖీ కడుతున్నారు. ఈ ప్రత్యేకమైన ఆచారం వెనుక ఒక బలమైన నమ్మకమే దాగి ఉంది. తమ జీవితాంతం తమకు తోడుగా ఉంటూ రక్షణ కవచంలా నిలిచేది భర్తలేనని.. అందుకే వారికి రాఖీలు కడ్తున్నామని చెబుతున్నారు. అయితే ఈ ఆచారం ఈమధ్య కాలంలోనే మొదలైంది కాదు. తరతరాలుగా ఈ సమాజంలో ఈ పద్ధతి కొనసాగుతూ వస్తోంది.ఈ గిరిజనులు ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తారు. వారి జీవితం పూర్తిగా అడవులు, వ్యవసాయంపై ఆధారపడి ఉంటుంది. అందుకే రక్షాబంధన్ పండుగ కేవలం మానవ సంబంధాలకు మాత్రమే పరిమితం కాకుండా.. ప్రకృతికి కూడా విస్తరింప జేశారు. పండుగ రోజున భర్తలకు రాఖీ కట్టిన తర్వాత.. మహిళలు తమ పొలాల్లోకి వెళ్లి తాము పండించిన పంటలకు రాఖీలు కడతారు. ఇలా చేయడం ద్వారా తమకు ఆహారాన్ని, జీవనాన్ని అందిస్తున్న భూమికి, పంటకు కృతజ్ఞత తెలియజేస్తారు. అంతేకాకుండా అడవుల్లో జీవనోపాధి కల్పించే చెట్లకు కూడా రాఖీలు కట్టి, వాటిని రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తారు. ఈ ఆచారం వారి సంస్కృతిలో ప్రకృతి పట్ల ఉన్న గౌరవానికి, కృతజ్ఞతకు నిదర్శనంగా నిలుస్తోంది.గోండు గిరిజనులు రాఖీలను కూడా తమ సంప్రదాయం ప్రకారం తయారు చేసుకుంటారు. వారు మార్కెట్లో లభించే రంగురంగుల రాఖీలకు బదులుగా.. పసుపు రంగు దారంతో, దూదితో 'దేవ్ రాఖీ'లను స్వయంగా తయారు చేసుకుంటారు. ఈ రాఖీలను కట్టే ముందు వాటికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పూజల అనంతరం వాటిని మొదట పంటలకు, చెట్లకు కట్టి, తమ విశ్వాసాన్ని చాటుకుంటారు. అయితే ఈ విలక్షణ సంప్రదాయంలో ఇటీవలి కాలంలో కొన్ని మార్పులు

## వేడి నూనెలో ఆయిల్ ప్యాకెట్లు ముంచి.. పకోడీలు చేస్తున్న వీధివ్యాపారి..



లుధియానా-నవభూమి: వీధి వ్యాపారులు( ఒక్కొక్కరు ఒక్కో స్టయిల్‌లో ఫుడ్ తయారీ చేస్తుంటారు. అయితే లూధియానాలో ఉన్న ఓ స్టాల్ ఓనర్ పకోడీలు చేస్తున్న తీరు కొంత ఆందోళన కలిగిస్తున్నది. కడాయిలో వేడిగా కాగుతున్న నూనెలో.. మరింత నూనె పోసేందుకు చాలా అభ్యంతరకరమైన విధానాన్ని వాడుతున్నాడతను. ఓ చేతిలో అయిదు ఆయిల్ ప్యాకెట్లను పట్టుకుని.. వాటిల్లో ఉన్న నూనెను కడాయిలో పోసేందుకు కట్ చేయకుండానే.. కాగుతున్న నూనెలో ముంచుతున్నాడు. ఆ నూనె వేడికి ఆయిల్ ప్యాకెట్లలో ఉన్న పచ్చి నూనె కడాయిలో పడిపోతోంది. ఇక ఆ తర్వాత ఆ నూనెతోనే బ్రెడ్ పకోడీలు తయారు చేస్తున్నాడు ఆ వీధి వ్యాపారి.ఇదంతా ఓ బ్లాగర్ తన వీడియోలో చిత్రీకరించాడు. ఆ వ్యాపారి మాత్రం తన చర్యను సమర్థించుకున్నాడు. కాగుతున్న నూనెలో ఆయిల్ ప్యాకెట్లను ముంచడం పట్ల ఆన్‌లైన్‌లో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆహార నిపుణులు ఈ విధానాన్ని తప్పుపడుతున్నారు. ఆయిల్ ప్యాకెట్లను ముంచిన నూనెలో వండిన వంటకాలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని అంటున్నారు. వేడి నూనెలో ప్లాస్టిక్ కలుస్తుందని గ్రహించకుండానే జనం ఆ పకోడీలను తినేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ, స్థానికలు ఆ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రీట్ ఫుడ్ విషయంలో జాగ్రత్త పాటించాల్సి ఉంటుందని కొందరన్నారు.

## బీహార్‌లో ట్రంప్ నివాసం..
### ఎప్పుడు తీసుకున్నారు, ఎందుకు కొన్నారంటే?


कार्यालय का नाम: अंचल
वेदन पत्र संख्या : BRCCO/2025/17989
आवेदन का प्रकार / Application Type
आवेदक का नाम (Name of Applicant)
लिंग / Gender
पिता का नाम (Name of Father)

పట్నా-నవభూమి: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా మారారు. ఏంటీ అమెరికా అధ్యక్షుడు బిహార్‌లో స్థిరపడ్డారా అనుకుంటున్నారా.. అదేం లేదండీ. వాస్తవానికి ఆయన యూఎస్‌కు చెందిన వాడే కాగా.. ట్రంప్ పేరుతో బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో నకిలీ నివాస ధ్రువీకరణ పత్రం కోసం ఒక దరఖాస్తు దాఖలు చేశారు. ఈ వింత సంఘటన రాష్ట్రంలో రాజకీయ, పరిపాలనా వర్గాలలో కలకలం సృష్టించింది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో జరుగుతున్న మోసాలకు ఇది పరాకాష్ట అని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది.వివరాల్లోకి వెళ్తే.. సమస్తిపూర్ జిల్లాలోని ఒక వ్యక్తి తన నివాస ధ్రువీకరణ పత్రం కోసం డొనాల్డ్ ట్రంప్ పేరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. ఈ నకిలీ దరఖాస్తులో ట్రంప్‌ను సమస్తిపూర్‌లోని ఒక నివాసిగా పేర్కొన్నారు. ఈ దరఖాస్తు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో.. అధికారులు వెంటనే అప్రమత్తం అయ్యారు. సమస్తిపూర్ జిల్లా యంత్రాంగం ఈ దరఖాస్తును తనిఖీ చేసి, అది నకిలీదని గుర్తించి వెంటనే తిరస్కరించింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈ రకమైన మోసాలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడానికి ఉన్నతాధికారులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.అమెరికా సుంకాలే మనకు బీహార్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ (ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ) ప్రక్రియలో ఇలాంటి విచిత్రమైన ఘటనలు జరగడం ఇది మొదటిసారి కాదు. గతంలో 'కుత్తా బాబు' అనే పేరుతో.. ఓ శునకానికి నివాస ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే.. 'సోనాలికా ట్రాక్టర్' అనే పేరుతో.. ట్రాక్టర్ పేరిట కూడా నకిలీ దరఖాస్తులు దాఖలు అయింది. ఒక కుక్కకు, ఒక ట్రాక్టర్‌కు నివాస ధ్రువీకరణ పత్రం కావాలంటూ దాఖలైన ఈ దరఖాస్తులు కూడా అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించాయి. ఇవన్నీ ఓటరు జాబితాల తయారీలో ఉన్న లొసుగులు, అజాగ్రత్తను ఎత్తిచూపుతున్నాయి.


ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ముఖ్యంగా బీహార్ ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఎత్తిపొడుస్తోంది. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ఎంత అస్తవ్యస్తంగా ఉందో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఎన్నికల సంఘం వెంటనే ఈ వ్యవహారంపై స్పందించి, పారదర్శకంగా, సమర్థవంతంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నకిలీ దరఖాస్తు వెనుక ఉన్నవారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రంప్ పేరిట నివాస ధ్రువీకరణ పత్రం రాగా.. అంతా ఆయన ఇల్లు ఎక్కడ, ఎక్కడ స్థిరపడబోతున్నారు, ఎప్పుడు ఇక్కడ నివాసం కొనుగోలు చేశారంటూ నెటిజన్లు ఫన్నీగా కామెంట్లు చేస్తున్నారు.

## విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం ఫెయిల్ : మల్లికార్జున్ ఖర్గే



న్యూఢిల్లీ-నవభూమి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా 25శాతం పన్నులు ప్రకటించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో పన్నులు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. దాంతో భారత్ నుంచి అమెరికా మార్కెట్‌కు వెళ్లే వస్తులపై మొత్తం 50శాతం పన్నులు విధించనున్నారు. అయితే, ట్రంప్ టారిఫ్స్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. సుంకాలు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం వైఫల్యంగా అభివర్ణించారు.భారత దౌత్యం బలహీనంగా, గందరగోళంగా కనిపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రధాని మోదీ పూర్తిగా విఫలమయ్యారని.. ట్రంప్ నిరంతరం భారత్‌పై ఒత్తిడిని తీసుకువస్తున్నారని ఆరోపించారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ట్రంప్.. భారత్ నుంచి అమెరికాకు వచ్చే అనేక ఉత్పత్తులపై అదనంగా 25శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ 25శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే 25శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. దాంతో మొత్తం సుంకాలు 50శాతానికి చేరాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు.అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేకపోయారని.. మంత్రులు నెలల నుంచి చర్చల గురించి మాట్లాడుతున్నారని.. మరికొందరు వాషింగ్టన్‌లో మకాం వేసినా ఏం జరుగలేదన్నారు. ఈ క్రమంలో పెద్ద దెబ్బ తగిలిందని.. అయినా ప్రధాని మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఆరునెలలుగా మోదీ ప్రభుత్వం అమెరికాతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేకపోయిందని.. ట్రంప్ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్నా.. మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ట్రంప్ బ్రిక్స్, వందశాతం సుంకాలపై వ్యాఖ్యానించినా ప్రధాని ఏమీ మాట్లాడలేదన్నారు. అమెరికా సుంకాల విధానంపై, ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 50శాతం సుంకాలతో దాదాపు రూ. 3.75 లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతుందన్నారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పాడి పరిశ్రమ, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఔషధాలు, పెట్రోలియం, వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు..!




న్యూఢిల్లీ-నవభూమి: కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఆయన మీడియా సమావేశం నిర్వహించి ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో 40లక్షల ఓట్లు రహస్యంగా జోడించారని ఆరోపించారు. 2024 లోక్‌సభ, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య ఈ ఓటర్లు ఓడించారన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ వరుసగా ఎన్నికల కమిషన్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే.
మహారాష్ట్ర, కర్నాటకతో పాటు పలు చోట్ల ఓటర్ల జాబితా ఆధారంగా చేసుకొని ఈసీపై మండిపడుతున్నారు. ఓటర్ల జాబితాలో చేర్చిన లక్షలాది ఓటర్లను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించకుండా ఓట్లను దొంగిలిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్‌ను దోషిగా పేర్కొంటూ.. ఈసీ విశ్వసనీయత సందేహాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సేకరించిన ఆధారాలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ.. బీజేపీ ఓట్లను దొంగిలిస్తుందన్నారు. ఓటర్ల జాబితా అంశంపై ఈసీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కొన్ని నెలల్లోనే లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చారని.. ఇది చాలా ఆందోళనకరమైన విషయమన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఓటర్ల సంఖ్య పెరగడం కూడా ఆశ్చర్యకరమైన విషయమన్నారు.ఓట్ల దొంగతనానికి సంబంధం సాక్ష్యాలను సేకరించేందుకు ఆరు నెలలు పట్టిందన్నారు. ఈ సందర్భంగా ఈసీకి ఆయన పలు ప్రశ్నలు సంధించారు. సాయంత్రం 5గంటల తర్వాత ఓటింగ్ ఎందుకు పెరిగింది ? ఎన్నికల కమిషన్ దీనికి సమాధానం చెప్పాలి అన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నలు అడిగిందని, ఇప్పటి వరకు ఒక్క సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా 2024 నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత, అసెంబ్లీ ఎన్నికలు 'రిగ్గింగ్' అయ్యాయని మా అనుమానాలు నిజమయ్యాయన్నారు.

## అలాంటి రోడ్లపై టోల్ వసూలు చేయొద్దు..
# హైకోర్టు సంచలన తీర్పు



తిరువనంతపురం-నవభూమి:దేశ అభివృద్ధిలో జాతీయ రహదారులు కీలక పాత్ర పోషిస్తాయి. సరకు రవాణాతోపాటు ప్రజలు కూడా ఒకచోటు నుంచి మరో చోటుకు ప్రయాణించేందుకు నేషనల్ హైవేలు చాలా ముఖ్యం. అయితే నేషనల్ హైవేల నిర్మాణం, వాటి మెయింటెనెన్స్ కోసం జాతీయ రహదారులపై అక్కడక్కడా టోల్ గేట్లు ఏర్పాటు చేసి.. ఆ రోడ్డుపై ప్రయాణించినందుకు వాహనదారుల నుంచి కొంత మొత్తాన్ని వసూలు చేస్తూ ఉంటారు. వాహనదారుల వద్ద నుంచి టోల్ ఫీజులు వసూలు చేసినందుకు.. ఆ రోడ్డుపై ప్రయాణించే వారికి సరైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ), సంబంధిత ఏజెన్సీలకు ఉం టుంది. కానీ సరైన సౌకర్యాలు కల్పించకపోతే.. ఆ మార్గంలో టోల్ ఛార్జీలు చెల్లించడం సరైంది కాదని తాజాగా ఓ కేసు విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు స్పష్టం చేసింది.రహదారుల విషయంలో వాహనదారులకు సరైన సేవలు అందించకపోతే.. టోల్ రుసుం వసూలు చేయలేరని ఎన్‌హెచ్‌ఏఐ, సంబంధిత ఏజెన్సీల కు కేరళ హైకోర్టు తేల్చి చెప్పింది. ఎన్‌హెచ్-544పై ఎడప్పల్లి-మన్నుతి మార్గంలో టోల్ ఛార్జీలు వసూలు చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ కేరళ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎడప్పల్లి-మన్నుతి మార్గంలో ఫ్లై ఓవర్లు, డ్రైనేజీల వంటి నిర్మాణ పనులు పూర్తి కాలేదని.. మరోవైపు సర్వీస్ రోడ్డు సరిగా లేకపోవడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోందని కొందరు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్‌హెచ్-544పై ఉన్న పరిస్థితుల్లో టోల్ వసూలు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేరళ హైకోర్టు ఈ మేరకు తీర్పును వెలువరించింది.పిటిషన్ల విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ రహదారిపై ప్రయాణించినందుకు టోల్ చెల్లించాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉందని తెలిపింది. అదే సమయంలో నేషనల్ హైవేలపై వాహనదారులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఎన్‌హెచ్‌ఏఐతో పాటు సంబంధిత ఏజెన్సీలపై ఉంటుందని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎన్‌హెచ్‌ఏఐకి, వాహనదారులకు మధ్య మంచి నమ్మకంతో కూడిన సంబంధం ఉంటుందని.. అది చెడిపోయిన సమయంలో వాహనదారుల నుంచి టోల్ వసూలు చేసే హక్కును వారికి ఇవ్వలేమని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ కేసులో ప్రజా ప్రయోజనాలను ఎన్‌హెచ్‌ఏఐ పట్టించుకోలేదని.. వాహనదారులు ఇచ్చిన ఫిర్యాదులను కూడా పెడచెవిన పెట్టిందని కోర్టు గుర్తుచేసింది.

## రెస్క్యూ ఆపరేషన్‌కు సవాల్‌గా మారిన ప్రతికూల వాతావరణం.. హెలికాప్టర్‌లో 65 మంది తరలింపు



న్యూఢిల్లీ-నవభూమి: దేవభూమి ఉత్తరాఖండ్ లోని ఉత్తరకాశీ లో జల విలయం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. పవిత్ర చార్‌ధామ్‌లలో ఒకటైన గంగోత్రికి వెళ్లే మార్గంలోని ధరాలి గ్రామంపై మంగళవారం ఆకస్మిక వరదలు విరుచుకుపడ్డాయి. కుంభవృష్టి కారణంగా వచ్చిన మెరుపు వరదలకు కొండచరియలు విరిగిపడి ఇళ్లు, హోటళ్లు, కార్లు కొట్టుకుపోయాయి. ఈ విలయంలో ఇప్పటి వరకూ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అయితే, జలప్రళయాన్ని చవిచూసిన ధరాలి ప్రాంతంలో వరుసగా మూడోరోజు గురువారం కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.
వరద ప్రభావిత ప్రాంతంలో చిక్కుకుపోయిన దాదాపు 65 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. అయితే, ఈ విపత్తులో ఎంతమంది తప్పిపోయారనేదానిపై స్పష్టత లేదు. శిథిలాల కింద వందలాది మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. చినూక్ హెలికాప్టర్లు, హెవీ-లిఫ్ట్ టెన్డం రోటర్ విమానం, -17 ఛాపర్ల ద్వారా వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ప్రతికూల వాతావరణ పరిస్థితులు సహాయక చర్యలకు సవాల్‌గా మారాయి. భారీ వర్షాలు, విరిగిపడుతున్న కొండ చరియల కారణంగా ధరాలీకి వెళ్లే రోడ్లన్నీ మూసుకుపోయాయి. దీంతో అక్కడ అనేక మంది టూరిస్టులు పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. గంగోత్రి, ఇతర ప్రాంతాల్లో చిక్కుకుపోయిన దాదాపు 274 మంది పర్యాటకులను రెస్క్యూ టీమ్ ఉత్తరకాశీ, డెహ్రాడూన్‌కు తరలిస్తోంది. అందులో 131 మంది గుజరాత్ వాసులు కాగా, 123 మంది మహారాష్ట్రకు చెందిన టూరిస్టులు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు విడుదలైన నోటిఫికేషన్..
# నామినేషన్లు షురూ..!



న్యూఢిల్లీ-నవభూమి: భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు అనివార్యం కావడంతో ఈ ప్రక్రియ మొదలైంది. ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన?డ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ఎన్నికలు జరపాల్సిన అవసరం ఏర్పడింది. ఆరోగ్యం సహకరించడం లేదని కారణం చూపుతూ ధన్కడ్.. జూలై 21వ తేదీన పదవి నుంచి వైదొలిగారు. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027 ఆగస్టు వరకు ఉంది. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయిన వెంటనే కొత్త వ్యక్తిని ఎన్నుకోవాలి. ఈ నిబంధనలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను వేగవంతం చేసింది.ఎన్నికల సంఘం గురువారం రోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే ఈరోజు నుంచే నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభం అవుతుందని తెలిపింది. ఆగస్టు 21వ తేదీ వరకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చు. ఆగస్టు 22వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఒకవేళ ఎవరైనా అభ్యర్థిత్వం ఉపసంహరించుకోవాలనుకుంటే.. ఆగస్టు 25వ తేదీ వరకు గడువు ఉంటుంది. సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నికను నిర్వహిస్తారు. ఎన్నిక జరిగిన రోజే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని ఈసీ తెలిపింది.ఈ ఎన్నికల నిర్వహణ బాధ్యతను రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు రిటర్నింగ్ అధికారిగా అప్పగించారు. ఆయనకు సహాయంగా మరో ఇద్దరు అధికారులు నియమితులయ్యారు. ఈ ఎన్నికలో ఓటు వేసే అధికారం పార్లమెంటులోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మాత్రమే ఉంటుంది. అయితే రాష్ట్రపతి ఎన్నికలా కాకుండా ఉపరాష్ట్రపతి ఎన్నికలో రాజ్యసభకు నామినేట్ అయిన సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. ప్రస్తుతం రాజ్యసభలో మొత్తం 233 మంది ఎన్నికైన సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు ఉన్నారు. లోక్‌సభలో 543 మంది సభ్యులు ఉన్నారు. దీని ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 788. అయితే రాజ్యసభలో ఐదు స్థానాలు, లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉండటంతో ఈ ఎన్నికలో 782 మంది సభ్యులు ఓటు వేయనున్నారు. ఎన్నికల్లో గెలవాలంటే అభ్యర్థికి 392 ఓట్లు అవసరం.ఇది దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయినప్పుడు.. రాజ్యసభ ఛైర్మన్ పదవి కూడా ఖాళీ అవుతుంది. ఈ పరిస్థితిలో రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించడానికి డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ ఎన్నిక పూర్తిస్థాయి ప్రజాస్వామ్య విధానంలో, ఏక బదిలీ ఓటు పద్ధతిలో రహస్య బ్యాలెట్ ద్వారా జరుగుతుంది.

## 'బఫూన్ బెదిరింపులు'.. డొనాల్డ్ ట్రంప్‌పై అసదుద్దీన్ ఒవైసీ ఫైర్

హైదరాబాద్ - నవభూమి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి తమ దేశానికి వచ్చే దిగుమతులపై అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించడంపై ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ చేష్టలు ముఖ్య స్థానంలో ఉన్న బఫూన్ బెదిరింపుల్లాఉన్నాయని ఎద్దేవా చేశారు.భారత ఎగుమతులపై ట్రంప్ ఇప్పటికే 25 శాతం సుంకాలను అమలు చేస్తున్నారని, ఇప్పుడు అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్స్ 50 శాతానికి చేరాయని అసదుద్దీన్ అన్నారు. ఇది భారతదేశంలోని ఎగుమతిదారులకు, చిరు వ్యాపారాలకు, వాటిలో పనిచేసే ఉద్యోగులకు ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం ఎలా జరుగుతుందో అర్థం చేసుకోకుండా ట్రంప్ అనుసరిస్తున్న వైఖరి దౌత్యం అనిపించుకోదని విమర్శించారు.



# మోచేయి నలుపు పోవాలంటే



అందంగా ఉండాలని అమ్మాయిలు ఎన్నో చేస్తారు. అయితే ఎక్కువగా ముఖం మీద మాత్రమే శ్రద్ధ పెడతారు. దాంతో మోచేతులు, మోకాళ్లు, మడమలు వద్ద చర్మం నల్లగా మారుతుంది. ఈ నల్లదనాన్ని ఎలా పోగొట్టుకోవాలో తెలుసుకుందాం..కలబందతో ఈ నలుపును వదిలించవచ్చు. కలబందు గుజ్జును మోచేతులు, మోకాళ్లు, మడమలు మీద రాయాలి. ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.ఒక చెంచా ఆలివ్ నూనెలో కొంచె పంచదార వేసి కలిపి. ఈ మిశ్రమాన్ని నల్లగా మారినా చర్మం మీద రాసి మర్దన చేయాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. పంచదార స్క్రబ్‌ల పనిచేసి మృతకణాలను తొలగిస్తుంది. క్రమంగా నలుపు తగ్గిపోతుంది.కొబ్బరి నూనె కూడా ఈ నలుపును తగ్గిస్తుంది. రోజూ మోచేతులు, మోకాళ్లు, మడమలకు కొబ్బరి నూనె కొంచెంసేపు మర్ధన చేయాలి. కొబ్బరి నూనెలో కొద్దిగా నిమ్మరసం కూడా కలపవచ్చు. ఇలా చేసిన మంచి ఫలితముంటుంది.నిమ్మకాయ సహజ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇందులోని విటమిన్ సి చర్మం మీద ఉన్న మృత కణాలను తొలగించడంలో సమర్థంగా పనిచేస్తుంది. నిమ్మకాయ ముక్కలను మోచేతులు, మోకాళ్ల మీద రుద్దితే మంచి ఫలితముంటుంది.పెరుగులోని లాక్టిక్ యాసిడ్ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. మోచేతులు, మోకాళ్ల మీద పెరుగు రాసి 15 నుంచి 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. వారానికి మూడు సార్లు ఇలా చేసి తరువాత కొబ్బరి నూనెతో మర్ధన చేయాలిల

# చేనేతకు పూర్వ వైభవం



**ఒక శాస్త్రవేత్తగా ప్రపంచానికి భారత్ కీర్తిని చాటిన డాక్టర్ సుచిత్ర ఎల్లా ఇప్పుడు చేనేత రంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి చేనేత హస్తకళలకు ప్రత్యేక సలహాదారుగా సేవలందిస్తున్నారు.**

చేనేత అంటే కళ, వారసత్వం, జీవనవిధానం. సుచిత్ర ఎల్లా చిన్ననాటి నుంచే హస్తకళలపై అభిమానం కలిగి ఉండటం వల్ల ఈ బాధ్యతను స్వీకరించారు. ఆమె అనుభవాల ప్రకారం, తమిళనాడులోని కాంచీపురం నుంచి, ఆంధ్రప్రదేశ్ లోని ధర్మవరం, వెంకటగిరి వరకు ప్రతి చేనేత గ్రామానికి ప్రత్యేకత ఉంది. కానీ, ఆధునికత, మార్కెటింగ్ లోపం, ఆదాయ భరోసా లేకపోవడం వంటివి ఈ రంగాన్ని వెనక్కి నెడుతున్నాయి.

సుచిత్ర మాట్లాడుతూ, చేనేతకారులు తమ ఇంట్లలోనే పని చేస్తారని, వారి జీవనోపాధి పూర్తిగా నేత మీద ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. ఈ రంగాన్ని బలోపేతం చేయాలంటే:

1. లిలికోఆపరేటివ్ మోడల్‌లిలి బలపర్చాలి.
2. ముడి సరుకు సరఫరా సులభతరం చేయాలి.
3. రుణ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి.
4. బ్రాండింగ్, మార్కెటింగ్ లో నూతన టెక్నాలజీని వినియోగించాలి.

చేనేత దుస్తులు ఖరీదైనవని అపోహను కూడా ఆమె ఖండించారు. చిన్న మొత్తాల్లో ఉత్పత్తి జరగడం వల్లే ధరలు ఉంటాయని, కోఆపరేటివ్... ధరలు తగ్గిపోతాయని చె...

అంతేకాదు, చేనేతకు ... ప్రభుత్వ, ప్రైవేట్ రంగా... కూడా అత్యంత అవసర... నిలుపుకోవాలంటే చేనేత ... శాస్త్రవేత్తగా మార్గదర్శ... సుస్థిరతతో కూడిన భ... ముందుకు సాగుతున్నారు... మన విలువల పునాదికి ...

# మధుమేహమా.. మహిళలూ జాగ్రత్త!

మధుమేహం (డయాబెటిక్) ఆడా మగా, పిల్లలు, పెద్దవారు అనే తేడాలేకుండా అందరికీ వస్తోంది. ఇది రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం ఎంతైనా మంచిది. వచ్చిన వారు తగ్గించుకోవటానికి అందుబాటులో ఉన్న మార్గాలను అన్వేషించాలి. ఏదైమైనా పురుషులతో పోలిస్తే మహిళలు ఈ వ్యాధి బారిన ఎక్కువగా పడుతున్నారు. నియంత్రణ విషయంలోనూ పురుషులతో పోల్చితే మహిళలే ఎక్కువగా కష్టపడాల్సివస్తుంది. నిరంతర పర్యవేక్షణ కూడా చేయాల్సివస్తోంది. ఎందుకంటే మహిళల్లో షుగర్ అనేది ఓ జీవనశైలి వ్యాధి మాత్రమే కాదు. దీని కారణంగా ఇతర ప్రమాదకరమైన వ్యాధులు కూడా వస్తుంటాయి. గుండె సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. పురుషులతో పోలిస్తే షుగర్ కలిగిన మహిళలు 4 రెట్లు గుండె జబ్బులకు లోనయ్యే అవకాశం ఉంది. ఇవే కాకుండా కిడ్నీ వ్యాధులు, ఇతర మానసిక సమస్యలు కూడా మధుమేహం ఉన్న మహిళల్లో అధికంగా ఉంటాయనేది పలు అధ్యాయనాల్లో తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఈ వ్యాధి పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవటం ఉత్తమం.

**కారణాలేమంటే..**

రక్తంలో షుగర్ కంట్రోల్ లేకపోవటం వల్ల మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్‌కు శరీరం స్పందించే తత్వం తగ్గిపోతుంది. స్త్రీలలో సెక్స్ పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. ఇన్సులిన్ సెన్సివిటీ కూడా మహిళల్లోనే అధికంగా ఉంటుంది. శరీరంలో శక్తి సమతుల్యత, గ్లూకోజ్ మెటబోలిజం స్త్రీ, పురుషుల్లో విభిన్నంగా ఉంటుంది. అందువల్లనే చాలామంది మహిళలు రక్తంలో వచ్చే ఇబ్బందులే కాకుండా కొన్ని ప్రత్యేకమైన ఆరోగ్య సమస్యలను కూడా ఎదుర్కొంటారు. సాధారణంగా ఇలాంటి వారికి టైప్ 2 డయాబెటిస్ అధికంగా వస్తుంది. 40 ఏళ్లు పైబడిన వారు, అధిక బరువున్నవారు, కుటుంబంలో తల్లిదండ్రులు, లేదా తోబుట్టువులకు షుగర్ ఉన్న వారు, గర్భధారణ సమయంలో, అధికంగా కొలెస్ట్రాల్, పీసీఓఎస్‌తో బాధపడుతున్న వారు, శారీరకంగా చురుకైన జీవనశైలి లేని వారు ఈ వ్యాధి భారిన పడుతుంటారు.

**ఇన్ఫెక్షన్ల ముప్పు..**100 మందిలో 50 మంది మహిళలు తమ జీవిత కాలంలో ఎప్పుడో ఒకసారి వెజైనా, యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవాల్సివస్తోంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవటం, మూత్రాశయంలో మూత్రం పూర్తిగా ఖాళీ కాకపోవటం వల్ల అక్కడ బ్యాక్టీరియా అభివృద్ధి చెందే ప్రమాదం ఉంది. వెజైనా దగ్గర ఈస్ట్ ఇన్ఫెక్షన్ బారిన పడే ప్రమాదం ఉంది.

**పీసీఓడీ, పీసీఓఎస్‌తోనూ సమస్యలే..**

మహిళల్లో చాలామంది పీసీఓడీ, పీసీఓఎస్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 40 శాతం మందికి మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. బీపీ, గుండెజబ్బులు, బ్రెయిన్ హెమరేజ్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులకు పీసీఓడీతో సంబంధం ఉంది. ప్రపంచంలోనూ, మనదేశంలోనూ ఈ సమస్యలు తీవ్రంగానే ఉన్నాయి. ప్రతి నలుగురిలో ఒక అమ్మాయి ఈ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు ఉన్నాయి. తొలినాళ్లలోనే దీనిని గుర్తించటం, తినే ఆహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవటం, యోగా, స్విమ్మింగ్ వంటివి వ్యాయామాలు చేయటం, ఒత్తిడిని తగ్గించుకోవటం, బరువు పెరగకుండా చూసుకోవటం ద్వారా ఇలాంటి సమస్యలను నివారించుకోవచ్చు.

**రాకుండా ఉండాలంటే**

రక్తంలో చక్కెరస్థాయిలను అదుపులో ఉంచుకోవాలి.తగినంత నీటిని తాగాలి
కాటన్ లో దుస్తులు ధరించాలి
మూత్రాన్ని ఆపుకోకుండా జాగ్రత్తపడాలి

గర్భధారణ సమయంలో%
%రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు గర్భధారణ కూడా కష్టమే. ఒకవేళ వచ్చినా తొలి నెలల్లోనే గర్భస్రావం కావటం, పుట్టే పిల్లల్లో లోపాలు, ప్రి-మెచ్యూర్ డెలివరీ, శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో డాక్టర్ పర్యవేక్షణలో జాగ్రత్తలు పాటించటం ముఖ్యం. సాధారణంగానే మెనోపాజ్‌లో వేడి ఆవిర్లు, మూడ్‌స్వింగ్స్, నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన వంటి ఎన్నో సమస్యలు మహిళలను వేధిస్తుంటాయి. మధుమేహం కారణంగా నెలసరి సమస్యలు, కంటిచూపు తగ్గిపోవటం, కిడ్నీ సమస్యలు వంటివి కూడా మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి.

ఇబ్బందులు ఇవీ

**మూత్ర సంబంధిత ఇబ్బందులు**

రుతుక్రమం దెబ్బతినటం.. పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) మధుమేహం లక్షణాలు ప్రతి ముగ్గురిలో ఒకరికి మధుమేహం ఉన్నా తెలియటం లేదు. మొదట్లో పెద్దగా లక్షణాలు కనిపించకపోవటమే దీనికి కారణం. సమస్య పెరిగే కొద్దీ కొన్ని హెచ్చరికలు పొడచూపుతుంటాయి.

అతిగా దాహం వేయటం.. నోరు ఎండిపోవటం



విపరీతంగా ఆకలి వేయటం
మూత్రం ఎక్కువగా రావటం
అసాధారణ బరువు పెరగటం లేదా తగ్గటం
రక్తంలో గ్లూకోజు పెరిగితే తలనొప్పి, చూపు మసకబారటం, నిస్సత్తువ
తీవ్రమైతే గాయాలు, పుండ్లు త్వరగా మానకపోవటం
తరచూ మూత్రకోశ ఇన్ఫెక్షన్లు గజ్జల్లో దురద పెట్టడం
జననాంగం పొడిబారిపోవటం
లైంగిక కోరికలు తగ్గిపోవటం

ఇవి పాటించటం మేలు

వ్యాయామం చేయటం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవాలి.
తాజా పండ్లు, కాయగూరలు ఆహారంలో భాగం చేసుకోవాలి
విటమిన్లు, ఖనిజాలు వంటి పోషకాలుండే మొక్కల ఆధారిత ఆహారం మేలు
ఆహారం ఒకేసారి కాకుండా తక్కువమొత్తంలో ఎక్కువసార్లు తీసుకోవాలి
చక్కెరలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే పదార్థాలు కాకుండా సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఓట్‌మీల్, తృణధాన్యాలు తినాలి
మంచినీటిని అవసరమైంతస్థాయిలో తీసుకోవాలి.
శీతల పానీయాలను మానేయాలి
పీచు ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవాలి.

# ధ్యానం చేసేటప్పుడు ఇవి గుర్తుంచుకోవాలి

మానసిక ప్రశాంతతకు, చక్కని జ్ఞాపక శక్తికి ధ్యానం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ధ్యానం చేసేటప్పుడు ఇతరత్రా ఆలోచనలు రాకుండా మనసు స్థిరంగా ఉండాలంటే ఏమి చేయాలో తెలుసుకుందాం...

ధ్యానం కోసం నిశ్శబ్దంగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. పచ్చని చెట్ల మధ్య గాలి బాగా వీచే చోట ధ్యానానికి ఉపక్రమించడం మంచిది. ఉదయాన్నే లేదా సాయంత్రం వేళ ఇంట్లో ప్రశాంతంగా ఉండే చోట కూర్చుని ధ్యానం చేసుకోవచ్చు.


ధ్యానం చేస్తూ పక్షులు చేసే శబ్దాలు వినాలి. వీచే గాలితోపాటు చెట్లు, పూలు, మట్టి తదితరాలతో కూడిన ప్రకృతి నుంచి వచ్చే సువాసనలను ఆస్వాదించాలి. దీనివల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. శారీరక అలసట తగ్గుతుంది.

ధ్యానం చేసేటప్పుడు వచ్చే ఆలోచనలకు అడ్డుకట్ట వేసేందుకు శ్వాస మీద దృష్టి నిలపాలి. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను లెక్కిస్తూ ఉంటే ప్రయోజనం ఉంటుంది.



కళ్లు మూసుకుని ఇష్టమైన ప్రదేశాలను గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. వర్షం, సూర్యోదయం, సూర్యాస్తమయం, చెట్లతో నిండిన అడవి లాంటి వాటిని ఊహిస్తూ ఉండాలి. దీనివల్ల వేరే ఆలోచనలు రాకుండా ఉంటాయి.ఆలోచనలు ప్రారంభమవుతున్నప్పుడే వాటి నుంచి మనసును మరల్చాలి. రోజూ పది నిమిషాలు ఇలా చేస్తూ ఉంటే అనవసరమైన ఆలోచనలు రావడం క్రమంగా తగ్గుతుంది.

# పైథానీకి పూర్వ వైభవం



ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సవ్యసాచి ముఖర్జీ ఇటీవల నిర్వహించిన వేడుకల్లో... బరోడా రాణి రాధిక రాజే గైక్వాడ్ తళుక్కుమన్నారు. ఈ వేడుకల్లో ఆమె కట్టుకున్న నలుపు రంగు పైథానీ చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెడలో వేసుకున్న పొడవైన హారాల సెట్ చీర అందాన్ని ద్విగుణీకృతం చేసింది. దీనికి హుందాతనం తోడై రాజరికదర్పంతో వేడుకల్లో వెలిగిపోయారు రాధిక రాజే.

**ఏమిటీ చీర గొప్పదనం?**

రాధిక రాజే కట్టుకున్నది వందేళ్లనాటి కాటన్ పైథానీ నౌవరీ చీర. అంతేకాదు మహారాష్ట్ర రాజకుటుంబీకుల సంప్రదాయ వస్త్రం. తొమ్మిది గజాల ఈ చీర కొంగు, అంచులని స్వచ్ఛమైన బంగారంతో తయారు చేశారు. చీర మొత్తాన్ని నూలు దారాలు ఉపయోగించి మగ్గంపై నేశారు. మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని పైథానీ పట్టణంలోని చేనేత కళాకారులు వీటిని రూపొందిస్తారు. ఆ ప్రాంతం పేరుతోనే పైథానీ చీరలుగా ఇవి ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. వీటిల్లో పట్టు చీరలది ప్రత్యేక స్థానం. ఈ పైథానీ నేత కళ శతాబ్దాల నాటిది. నాణ్యమైన రంగురంగుల దారాలను బంగారు లేదా వెండి పోగులతో కలిపి చీరను నేస్తారు. ఏ రెండు పైథానీ చీరలు కూడా ఒకే రకంగా ఉండవు. వేటికవే వైవిధ్యంగా ఆకట్టుకొంటాయి. అందుకే ఇవి దేశంలోనే అత్యంత ఖరీదైన చీరలుగా పేరు పొందాయి.

**ఆమె ఖాతా... చీరల నిధి**

రాధిక రాజేకి భారతీయ వారసత్వ చీరలంటే ఎంతో ఇష్టం. ఆమె వద్ద చారిత్రక నేపథ్యంతో ముడిపడిన పురాతన కాలం చీరలు చాలా ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవాలంటే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిస్తే చాలు... అక్కడ అపురూపమైన చీరల నిధిని చూడవచ్చు. ఆమె ప్రత్యేకమైన చీర ధరించినప్పుడల్లా ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేయడమే కాదు... ఆ చీర ప్రత్యేకత, ఎవరు బహూకరించారు తదితర అంశాలన్నీ వివరిస్తారు. సవ్యసాచి ముఖర్జీ ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఉత్సవంలో రాధిక పాల్గొన్నారు. ఆ ఫొటోలతోపాటు మరొక ఫొటో కూడా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇందులో ఆమె అందమైన గులాబీ రంగు చీరతోపాటు ఆకుపచ్చని జాకెట్ ?ధరించారు. ఈ సందర్భంగా తన మనసులోని భావాన్ని ఇలా రాసుకున్నారు... "ఇది తొమ్మిది గజాల జరీ కాటన్ పైథానీ చీర. ఈ అందమైన తొమ్మిది గజాల చీర మొత్తం జరీ పువ్వులతో నిండి ఉంది. చీరకు జతగా యాంటిక్ ఫ్రెంచ్ బ్రోకేడ్ బ్లౌజ్ వేసుకున్నా! ఈ చీర భారతదేశ వస్త్ర వారసత్వానికి ప్రతీక. ఇండోర్ మహారాణి సంయోగిత రాజే ఇలాంటి చీరలు కట్టుకునేవారు. ఈ చేనేత సంప్రదాయ కళ ఇకపై కూడా కొనసాగాలని కోరుకుంటున్నా! నాజూగ్గా ఉంటూ అందమైన పువ్వులు, జరీ మోటిఫ్‌లతో నిండిన టిష్యూ, షిఫాన్, కాటన్, చందేరీ సిల్క్ చీరలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం నౌవరీ (తొమ్మిది గజాలు) చీరలను ఎవరూ కొనడం లేదు. వీటిని ఎక్కువగా అమ్మమ్మలు, బామ్మలు లేదంటే పనివాళ్లు, మత్స్యకారులు కట్టుకుంటున్నారు. వీటికి పూర్వ వైభవం తెచ్చేందుకే ఈ ప్రయత్నం."

**గతంలో కూడా...**

రాధిక రాజే ఈ నలుపు రంగు కాటన్ పైథానీ చీరని గతంలో కూడా ఓసారి ధరించారు. అప్పట్లో ఓ మ్యాగజైన్ కవర్ షూట్ నిమిత్తం ఆమె ఈ చీర కట్టుకుని దిగిన ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఈ చీర గురించి చెబుతూ ఇది అత్యంత అరుదైన చీర అనీ, తనకు చాలా ప్రీతిపాత్రమైనదనీ, ఇలాంటి చీరలు ప్రస్తుతం లభ్యం కావట్లేదనీ వివరించారు.

# తల్లిపాల దానంలో తిరుచ్చి మహిళ రికార్డు



తమిళనాడులోని తిరుచ్చి నగరం సమీప కాట్టూరుకు చెందిన సెల్వబృంద (34) అనే గృహిణి 300 లీటర్ల దాకా తల్లిపాలను దానం చేసి తన అమ్మ మనసు చాటుకుంది. తద్వారా ఆమె అరుదైన రికార్డ్ సాధించింది. ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉన్న ఆ మహిళ తిరుచ్చిలోని మహాత్మాగాంధీ స్మారక ప్రభుత్వ ఆస్పత్రిలోని తల్లిపాల బ్యాంక్‌కు 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి దాకా అంటే 22 నెలల వ్యవధిలో 300.17 లీటర్ల రొమ్ముపాలను దానం చేసింది. ఆమె చేసిన పాలదానం వల్ల బరువుతక్కువగా జన్మించిన పసికందులు, రొమ్ముపాలు కొరతగా ఉన్న బాలింతలకు జన్మించిన పసికందులకు ప్రాణదానం చేసినట్లయింది. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆ తల్లిపాల బ్యాంక్ అధికారులు ఈ వివరాలను బుధవారం వెల్లడించారు. సెల్వ బృంద చేసిన తల్లిపాల దానం ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్సు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సాధించింది.

# గోరింటాకుతో కురులు ఆరోగ్యంగా...



గోరింటాకును మెత్తగా రుబ్బి తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరిన తరవాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే శిరోజాలకు పోషణ అంది చక్కగా పెరుగుతాయి. మాడు మీద దురద, చుండ్రు, కురుపులు లాంటి సమస్యలు రావు.

గుప్పెడు గోరింట ఆకులను ఒక కప్పు కొబ్బరి నూనెలో వేసి బాగా మరిగించి వడకట్టాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని చేతి వేళ్లతో తీసుకుని మాడుకు పట్టేలా మర్దన చేయాలి. పలుచని వస్త్రాన్ని తలకు కట్టుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే వెంట్రుకల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం, నెరవడం లాంటి సమస్యలు తగ్గుతాయి. ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల మెంతి పొడి, ఒక చెంచా శీకాయ పొడి, ఒక చెంచా ఉసిరి పొడి వేసి అర కప్పు టీ డికాషన్‌తో ముద్దలా కలపాలి. దీనిని తల వెంట్రుకలకు, మాడుకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేస్తే శిరోజాలు రాలడం తగ్గి నల్లగా ఒత్తుగా నిగారిస్తాయి.ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల కాఫీ పొడి, ఒక చెంచా మందార నూనె వేసి నీళ్లతో కలిపి తలకు పట్టిస్తే జుట్టు నెరవడం తగ్గుతుంది.గోరింట పొడిని గుడ్డు తెల్ల సొనతో కలిపి తలకు పట్టించి రెండు గంటల తరవాత శీకాయ పొడితో తలస్నానం చేస్తే తల వెంట్రుకలు నున్నగా మెత్తగా మెరుస్తాయి.ఒక కప్పు బ్లాక్ టీలో అర కప్పు గోరింట పొడిని కలిపి రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే ఈ మిశ్రమంలో కొద్దిగా పెరుగు కలిపి తలకు పట్టించి ఇరవై నిమిషాల తరవాత తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.

# నవ బిజినెస్




## ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్.. స్టాక్ మార్కెట్లకు వరుస నష్టాలు..




**ముంబై-నవభూమి:**భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 సుంకాలను విధించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు నష్టాలను కొనసాగిస్తున్నాయి. ట్రంప్ బెదిరింపుల కారణంగా అంతర్జాతీయంగా కూడా మిశ్రమ సంకేతాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా నష్టాలతో మొదలయ్యాయి. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడం కాస్త సానుకూలాంశంగా కనిపిస్తోంది. కాగా, ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల బాటలో ఉన్నాయి.బుధవారం ముగింపు (80, 543)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 300 పాయింట్ల నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కోలుకుంది. పలు రంగాల్లో మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపుతుండడంతో నష్టాల్లోనే కదలాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 279 పాయింట్ల నష్టంతో 80, 264 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 78 పాయింట్ల నష్టంతో 24, 495 వద్ద కొనసాగుతోంది.

## ఫ్లిప్‌కార్ట్ ఫ్రీడమ్ సేల్ లాస్ట్ ఛాన్స్.. వీటిపై క్రేజీ ఆఫర్స్..



**హైదరాబాద్-నవభూమి:**మీరు మంచి షాపింగ్ ప్రియులా. అయితే ఇటీవల మొదలైన ఫ్లిప్‌కార్ట్ ఫ్రీడమ్ సేల్‌ను వినియోగించుకోండి. ఎందుకంటే ఈ సేల్ ఆగస్టు 8 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, హోమ్ అప్లయన్సెస్ లాంటి అనేక రకాల ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్లు, ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. ఆ వివరాలేంటో ఇక్కడ చూద్దాం.

మీరు మంచి స్మార్ట్‌ఫోన్ కొనాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే 16, 24, ాంటి లేటెస్ట్ మొబైల్స్‌పై భారీ డిస్కౌంట్స్ పొందవచ్చు. దీంతోపాటు ల్యాప్‌టాప్స్, హెడ్‌ఫోన్స్, స్మార్ట్ టీవీలతోపాటు హోమ్ అప్లయన్సెస్ లాంటి ఎలక్ట్రానిక్స్‌పై కూడా సూపర్ డీల్స్ ఉన్నాయి. ఫ్యాషన్ లవర్స్ కోసం కూడా ఈ సేల్‌లో చాలా ఆఫర్స్ ఉన్నాయి. ఇవి కాకుండా మీ కళ్లను మరింత ఆకర్షణీయంగా మార్చుకునేందుకు పలు రకాల ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉన్నాయి.మరోవైపు ట్రెండీ దుస్తులు, ఫుట్‌వేర్, యాక్సెసరీస్‌పై కూడా ఆకర్షణీయమైన ఆఫర్లు లభిస్తున్నాయి. ఇంకా, ఇంటి డెకరేషన్ కోసం ఫర్నిచర్, కిచెన్ అప్లయన్సెస్‌పై కూడా డిస్కౌంట్స్ లభిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ ఫ్రీడమ్ సేల్‌లో బ్యాంక్ ఆఫర్లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలో బ్యాంక్, %దీశీదీ% కార్డ్ వాడే వాళ్లకి క్రెడిట్ కార్డ్ లేదా ట్రాన్సాక్షన్స్‌పై 10% వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. అంతేకాదు, ఎలిజిబుల్ ప్రొడక్ట్స్‌పై నో కాంఆప్షన్స్ కూడా ఉంది.మీ పాత ఫోన్ లేదా ఎలక్ట్రానిక్ ఐటమ్‌ని ఎక్స్ఛేంజ్ చేస్తే అదనపు డిస్కౌంట్ పొందవచ్చు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ మెంబర్స్‌కి మరో స్పెషల్ బెనిఫిట్ ఉంది. మీరు మీ సూపర్‌కాయిన్స్ వాడుకుని ఎక్స్‌ట్రా సేవింగ్స్ పొందవచ్చు. అంటే, ఈ సేల్‌లో షాపింగ్ చేయడం వల్ల డబ్బు ఆదా చేయడమే కాదు, మీ బడ్జెట్‌లో సూపర్ డీల్స్ కూడా దొరుకుతాయి.

## మరింత పెరిగిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

**హైదరాబాద్-నవభూమి:**బంగారం ధర మళ్లీ ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అవుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 7న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 02, 340కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 93, 810కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర స్వల్పంగా పెరిగింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 02, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 960కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 02, 340కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 93, 810కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)



హైదరాబాద్‌లో రూ. 1, 02, 340, రూ. 93, 810
విజయవాడలో రూ. 1, 02, 340, రూ. 93, 810
ఢిల్లీలో రూ. 1, 02, 490, రూ. 93, 960
ముంబైలో రూ. 1, 02, 340, రూ. 93, 810
వడోదరలో రూ. 1, 02, 390, రూ. 93, 860
కోల్‌కతాలో రూ. 1, 02, 340, రూ. 93, 810
చెన్నైలో రూ. 1, 02, 340, రూ. 93, 810
బెంగళూరులో రూ. 1, 02, 340, రూ. 93, 810
కేరళలో రూ. 1, 02, 340, రూ. 93, 810
పుణెలో రూ. 1, 02, 340, రూ. 93, 810

## వచ్చే ఏడాది ఇండోసోల్ సోలార్ ఐపీఓ



**హైదరాబాద్-నవభూమి:** స్థానిక శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఐపీఓ ఉంటుందని శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వర రెడ్డి చెప్పారు. ఒకవేళ ఏ కారణం చేతైనా ఇండోసోల్ సోలార్ ఐపీఓ కుదరకపోతే శిరిడీ సాయి ఎలక్ట్రికల్ ఐపీఓ ఉంటుందన్నారు. సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) మాడ్యూళ్ల తయారీ కోసం ఇండోసోల్ సోలార్ నెల్లూరు జిల్లాలోని కరేడు వద్ద ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంటులో వచ్చే ఏడాది చివరి కల్లా 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ పీవీల ఉత్పత్తి ప్రారంభమవుతుందని విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఈ ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకం కింద రూ.5,175 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నట్టు చెప్పారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు కోసం రూ.69,000 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

## టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు

**న్యూఢిల్లీ-నవభూమి:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వచ్చేనెల 1 నుంచి అమలులోకి వచ్చేలా 80ి సిబ్బంది వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రధానంగా జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది 12,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు టీసీఎస్ ఈ మధ్యనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో కంపెనీ జీతాలను పెంచడం గమనార్హం.

# టెక్ ప్రపంచంలో కొత్త అధ్యాయం: ఫోన్‌పేకి చెందిన ఇండస్ యాప్‌స్టోర్

**ముంబై-నవభూమి:**భారతదేశపు స్వదేశీ ఆండ్రాయిడ్ యాప్ మార్కెట్‌ప్లేస్ అయిన ఇండస్ యాప్‌స్టోర్, ఫ్రెంచ్ కన్స్యూమర్ టెక్నాలజీ బ్రాండ్ అయిన అల్కాటెల్‌తో వ్యూహాత్మక OEM భాగస్వామ్యాన్ని ఈరోజు ప్రకటించింది. ఈ దీర్ఘకాలిక భాగస్వామ్యంలో భాగంగా, భారతదేశంలోని అన్ని అల్కాటెల్ స్మార్ట్‌ఫోన్‌లలో ఇండస్ యాప్‌స్టోర్ యాప్ స్టోర్‌గా ముందే ఇన్‌స్టాల్ చేయబడుతుంది. లోకల్ యాప్ మార్కెట్‌ప్లేస్‌ను అనుసంధానించడం ద్వారా, ఈ రెండు బ్రాండ్‌లు దేశవ్యాప్తంగా మిలియన్ల కొద్దీ వినియోగదారులకు ఆవిష్కరణ, సులభ వినియోగాన్ని పెంపొందించడం కొనసాగిస్తాయి

ఫోన్‌పేకి చెందిన ఇండస్ యాప్‌స్టోర్ 45 కేటగిరీలలో ధృవీకరించబడిన మొబైల్ యాప్‌లు, గేమ్‌ల కేటలాగ్‌ను కలిగి ఉంది. ఇది 12 భారతీయ భాషలకు సపోర్ట్ చేస్తుంది, 10 ప్రాంతీయ భాషలలో వాయిస్ సెర్చ్‌ను అనుమతిస్తుంది, ఇంకా యూజర్లు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే ముందు వాటిని చూసేందుకు వీలుగా, వీడియో ఆధారిత యాప్ డిస్కవరీ అనుభవాన్ని ఇది అందిస్తుంది. సాంప్రదాయ యాప్‌స్టోర్‌లకు భిన్నంగా, ఇండస్ యాప్‌స్టోర్ కేవలం యాప్‌లను డౌన్‌లోడ్ చేయడానికి మాత్రమే కాదు, ప్రతి యూజర్‌కు తగిన యాప్‌లను సులువుగా కనుగొనడానికి కూడా వీలు కల్పిస్తుంది.

NxtCell ఇండియా, టీసీఎల్ నుండి "అల్కాటెల్" బ్రాండ్‌ను భారతదేశంలో, ఎంపిక చేసిన అంతర్జాతీయ మార్కెట్‌లలో ప్రాతినిధ్యం వహించడానికి, నిర్వహించడానికి ప్రత్యేకమైన బ్రాండ్ అధికారాన్ని కలిగి ఉంది, ఈ భాగస్వామ్యాన్ని నడపడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఈ భాగస్వామ్యం, భారత ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి మద్దతుగా, స్థానిక సాంకేతిక పరిష్కారాలను అందించి భారతీయ యూజర్లు డెవలపర్లను ప్రోత్సహించాలన్న %NxtCell% దూరదృష్టిని ప్రతిబింబిస్తుంది.భారత్‌లో విడుదలైన కొద్దికాలానికే, ఇండస్ యాప్‌స్టోర్ అల్కాటెల్‌తో జతకట్టింది. దీనితో, ఇది ఆ బ్రాండ్ ప్రయాణంలో మొదటి నుంచే భాగం కానుందిఈ భాగస్వామ్యం గురించి ఇండస్ యాప్‌స్టోర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రియా ఎం. నరసింహన్ మాట్లాడుతూ, "భారతదేశంలో అల్కాటెల్ ప్రయాణపు ప్రారంభ దశల్లోనే వారితో భాగస్వామ్యం కావడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ భాగస్వామ్యం ద్వారా అల్కాటెల్ వినియోగదారులు స్వదేశీ ప్లాట్‌ఫారమ్ ద్వారా యాప్‌లను అన్వేషించి, అనుభవించే అవకాశాన్ని పొందుతారు. ఇది నిజమైన స్థానిక అవసరాలకు అనుగుణమైన వ్యక్తిగత అనుభూతిని పొందేలా చేస్తుంది.

ఈ భాగస్వామ్యం ఇండస్ యాప్‌స్టోర్ పరిధిని కూడా విస్తరిస్తుంది, అదే సమయంలో డెవలపర్‌లు, విక్రయదారులు తమ యాప్‌లను ప్రదర్శించడానికి, భారతదేశం అంతటా ఎక్కువ మంది వినియోగదారులతో కనెక్ట్ అవ్వడానికి అవకాశాలను అందిస్తుంది" అని అన్నారు.ఈ భాగస్వామ్యంపై వ్యాఖ్యానిస్తూ, %NxtCell% ఇండియా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అతుల్ వివేక్ మాట్లాడుతూ, "మేము భారతీయ మార్కెట్‌లోకి అల్కాటెల్ స్మార్ట్‌ఫోన్‌లను మళ్లీ ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్నందున, స్థానిక ఆవిష్కరణ ద్వారా అర్థవంతమైన భేదాన్ని సృష్టించడంపై మా దృష్టి ఉంది. ఫోన్‌పేకి చెందిన ఇండస్ యాప్‌స్టోర్‌తో భాగస్వామ్యం చేసుకోవడం వల్ల, మేము మొదటి నుంచి భారతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా డిజిటల్ అనుభవాన్ని అందించగలుగుతాము. వారు మొదటి నుంచీ మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉన్నారు. దీర్ఘకాలిక భాగస్వామ్యం కోసం మేము ఎదురు చూస్తున్నాము. మా కస్టమర్లకు ఆవిష్కరణ, విశ్వసనీయతను అందించాలనే మా నిబద్ధతను ఈ భాగస్వామ్యం మరోసారి రుజువు చేస్తుంది" అని అన్నారు.

**ఇండస్ యాప్‌స్టోర్ గురించి**

ఇండస్ యాప్‌స్టోర్ ఒక స్థానిక ఆండ్రాయిడ్ ఆధారిత మొబైల్ యాప్ స్టోర్. ఇది భారతీయ కస్టమర్ల స్థానిక, సాంస్కృతిక అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది. వివిధ రకాల విభాగాలతో, ఇది వినియోగదారులకు స్థానికమైన, సందర్భానికి తగిన వ్యక్తిగత అనుభవాన్ని అందించడానికి ప్రయత్నిస్తుంది.ఇండస్ యాప్‌స్టోర్ ఇంగ్లీష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది, ఇది వినియోగదారులకు వారికి నచ్చిన భాషలో యాప్ స్టోర్‌ను అన్వేషించడానికి వీలు కల్పిస్తుంది.

డెవలపర్‌ల కోసం, ఇండస్ యాప్‌స్టోర్ ఒక చక్కని వేదికను అందిస్తుంది. దీని ద్వారా వారు తమ ఉత్పత్తులను భారతీయ యాప్ ఎకోసిస్టమ్‌లో చేర్చవచ్చు, పంపిణీ చేయవచ్చు, అభివృద్ధి చెయ్యవచ్చు. ఇది సెల్ఫ్-పబ్లిషింగ్ ప్లాట్‌ఫారమ్‌ను, స్థానిక భాషల్లో అందుబాటులో ఉంచడానికి, యాప్‌లను పర్యవేక్షించడానికి అభివృద్ధి చేయడానికి అనేక సాధనాలను, అలాగే 24ఐ7 ప్రత్యేక కస్టమర్ సపోర్ట్?ను అందిస్తుంది.

**అల్కాటెల్ గురించి..**అల్కాటెల్ 1996లో స్థాపించబడిన ఒక ఫ్రెంచ్ టెక్ బ్రాండ్. నోకియాతో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కింద టీసీఎల్ కమ్యూనికేషన్ స్వతంత్రంగా నిర్వహిస్తున్న బ్రాండ్ ఇది. 160 కంటే ఎక్కువ దేశాలలో లభించే అల్కాటెల్ సంస్థ, ఆవిష్కరణలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, సరసమైన ధరలకే నాణ్యమైన టెక్నాలజీని అందించడానికి కట్టుబడి ఉంది. దీని ద్వారా వినియోగదారులు కొత్త విషయాలను కనుగొనడానికి, ఇతరులతో పంచుకోవడానికి స్ఫూర్తిని పొందడానికి ప్రోత్సహిస్తుంది.

### ఆఫర్ అంటే ఇది.. 100 షేర్లు కొంటే 1600 షేర్లు ఫ్రీ..

# లక్షను 5 ఏళ్లలో కోటి చేసిన స్టాక్ ఇదే!



**ముంబై-నవభూమి:** స్మాల్ క్యాప్ కేటగిరి, ఫైనాన్స్ రంగంలోని ప్రముఖ స్టాక్స్‌లో ఒకటైన ఆల్గోక్వాంట్ ఫిన్టెక్ లిమిటెడ్ స్టాక్ తమ ఇన్వెస్టర్లను కోటీశ్వరులను చేసింది. లక్ష రూపాయల పెట్టుబడిని కేవలం 5 ఏళ్లలోనే రూ.1 కోటికి పెంచింది. ఇప్పుడు ఈ కంపెనీ రెండు శుభవార్తలు అందించింది. ఈ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఇటీవలే సమావేశమై స్టాక్ స్ప్లిట్, బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలుపినట్లు కంపెనీ తెలిపింది. ఇప్పుడు 1 షేరు కొనుగోలు చేస్తే ఏకంగా 16 షేర్లు ఖాతాలోకి ఉచితంగా వస్తాయి. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.తాజాగా ఈ రెండు ప్రయోజనాలకు అర్హులైన షేర్ హోల్డర్లను గుర్తించేందుకు కావాల్సిన రికార్డు తేదీని ఆగష్టు 18, 2025గా డైరెక్టర్స్ నిర్ణయించారు. మరోవైపు ఈ కంపెనీ స్టాక్ గత ఐదేళ్లలో ఏకంగా 11,858 శాతం మేర లాభాలు అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. ఒకవేళ మీరు ఐదు సంవత్సరాల క్రితం రూ. లక్ష పెట్టుబడితో షేర్లు కొనుగోలు చేసి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ. 1.19 కోట్ల వరకు అవుతుంది.కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. 1:2 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు కంపెనీ బోర్డు డైరెక్టర్స్ ఆమోదం తెలుపారు. దీని అర్థం రూ. 2 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరును రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 2 షేర్లుగా విభజిస్తారు. ఆ తర్వాత 8:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేసేందుకు కంపెనీ డైరెక్టర్స్ ఆమోదం తెలిపారు. రికార్డు డేట్ నాటికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండే 1 ఈక్విటీ షేరు కొనుగోలు చేసి ఉన్న వారికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండే 8 ఈక్విటీ షేర్లన బోనస్ రూపంలో ఉచితంగా అందిస్తారు. ఈ బోనస్ షేర్ల, స్టాక్ స్ప్లిట్ సంబంధించిన రికార్డు డేట్ ఆగష్టు 18గానే నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. అంటే రికార్డ్ తేదీ నాటికి 1 షేరు కొంటే డీమ్యాట్ ఖాతాలోకి 16 షేర్లు వస్తాయి. ఈరోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగులో ఆల్గోక్వాంట్ ఫిన్టెక్ షేరు 0.20 శాతం లాభంతో రూ. 1279.65 వద్ద ట్రేడవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 1309 వద్ద ఉండగా అది కూడా ఈరోజే టచ్ చేయడం గమనార్హం. 52 వారాల కనిష్ఠ ధర రూ. 1183 వద్ద ఉంది. గత వారంలో ఈ షేరు సుమారు 3 శాతం పెరిగింది. గత నెల రోజుల్లో 9 శాతం లాభాన్ని అందించింది. గత ఆరు నెలల్లో 45 శాతం లాభాన్ని అందించింది. గత ఏడాదిలో 60 శాతం పెరిగింది. గత ఐదేళ్లలో ఈ షేరు 11,858 శాతం లాభాన్ని అందించింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 2000 కోట్లు వద్ద ఉంది.

# అమెరికా సుంకాలే మనకు 'అమృతం'

### ఆనంద్ మహీంద్రా సలహా ఇదే.. రెండడుగులు వేస్తే!



**ముంబై-నవభూమి:** భారత్‌కు అమెరికా మళ్లీ సడెన్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే భారత ఉత్పత్తులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించగా.. తాజాగా దీనిని డబుల్ చేశారు. మరో 25 శాతం సుంకాలు అదనంగా విధించారు ట్రంప్. పాత సుంకాలు నేటి నుంచి (ఆగస్ట్ 7, గురువారం) అమల్లోకి రానుండగా.. ఇదే సమయంలో కొత్త సుంకాలు మాత్రం ఆగస్ట్ 27 నుంచి అమలవుతాయని ప్రకటించారు. ముఖ్యంగా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతోనే అదనపు సుంకాలు విధించారు. తాజాగా ఈ పరిణామాలపై ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా స్పందించారు. ఇప్పుడు ట్రంప్ టారిఫ్స్ రూపంలో ఎదురైన సంక్షోభాన్ని భారత్ ఒక మంచి అవకాశంగా మల్చుకోవాలని సూచించారు.ఇక్కడ భారత్ రెండు బలమైన అడుగులు వేస్తే గనుక.. అప్పుడు సుంకాల మథనం నుంచి భారత్ అమృతాన్ని దక్కించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మహీంద్రా.. తన ట్విట్టర్ అకౌంట్లో ఒక పోస్ట్ పెట్టారు."అమెరికా మొదలుపెట్టిన టారిఫ్స్ యుద్ధంతో ఎన్నో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ జర్మనీ, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలపై అమెరికా సుంకాల విధింపుతో అవి ఇప్పటికే తమ సొంత వ్యూహాలకు మరింత పదునుపెట్టాయి. దీంతో ప్రపంచ వృద్ధికి కొత్త ఇంజిన్లు వస్తున్నాయి. ఇదే బాటలో భారత్ కూడా దీనిని అవకాశంగా మల్చుకోగలదా? అప్పట్లో 1991లో మన దేశంలో విదేశీ మారక నిల్వల సంక్షోభం రాగా.. లిబరలైజేషన్‌కు అడుగు పడింది. ఇప్పుడు ఈ సుంకాల 'మథనం'తో కూడా మనకు 'అమృతం' దక్కేనా? దీని కోసం భారత్ రెండు బలమైన అడుగులు వేయాలి.' అని అన్న మహీంద్రా.. కొన్ని సూచనలు చేశారు. అవేంటంటే..౧౧ ముందుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని మరింత మెరుగుపర్చుకోవాలి. సంస్కరణకు మించి పెట్టుబడి ప్రతిపాదనలపైన బలమైన సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలి. ప్రపంచ పెట్టుబడులకు తిరుగులేని వేదికగా భారత్ మారాలి. విదేశీ మారకపు నిల్వల్ని పెంచుకునే దిశగా ఇక్కడ పర్యాటక రంగం మరింత అభివృద్ధికి నోచుకోవాలి. దీంతో ఉపాధి కూడా పెరుగుతుంది. తయారీ రంగంపై దిగుమతి సుంకాల్ని తగ్గించే అంశాన్ని పరిశీలించాలి.

## ట్రంప్ బిగ్ షాక్.. ఇప్పుడు 50 శాతం సుంకాలు వీటిపైనే..




**న్యూఢిల్లీ-నవభూమి:** యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్.. భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటున్నారు. ఇప్పటికే మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే ఉత్పత్తులపై ఏకంగా 25 శాతం దిగుమతి సుంకాల్ని ప్రకటించిన ట్రంప్.. ఇప్పుడు మరోసారి అన్నంత పని చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాల్ని భారీగా పెంచేశారు. 25 శాతంపై మరో 25 శాతం పెంచి 50 శాతానికి చేర్చారు. అంతకుముందు ప్రకటించిన 50 శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వస్తాయని చెప్పగా.. కొత్త సుంకాలు ఆగస్ట్ 27 నుంచి అమలవుతాయని స్పష్టం చేశారు.ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో ముఖ్యంగా భారత వస్త్ర పరిశ్రమ , ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై మాత్రం వెంటనే ప్రభావం పడనుంది. ఇక మన దేశం నుంచి ఎగుమతి అయ్యే కొన్ని వస్తువులకు మాత్రమే ఈ అధిక టారిఫ్స్ నుంచి మినహాయింపు ఉంది.ఇప్పుడు 50 శాతం సుంకాలు దుస్తులు, ఆభరణాలు, రొయ్యలు, జెమ్స్, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, రసాయనాలు, యంత్ర సామగ్రి విద్యుత్ పరికరాలు, జంతు సంబంధ ఉత్పత్తులు వంటి వాటిపై వర్తిస్తాయి.ఇక ఔషధాలు, ఇంధన ఉత్పత్తులు (రిఫైన్డ్ ఇంధనం, సహజ వాయువు, కీలక ఖనిజాలు, బొగ్గు, విద్యుత్తు, క్రూడాయిల్, కంప్యూటర్స్, ట్యాబ్స్, సెమీ కండక్టర్స్, డ్రైవ్స్, స్మార్ట్ ఫోన్స్, ప్యానెల్ బోర్డ్స్, సర్క్యూట్స్) వంటి వాటిపై అధిక సుంకాల మినహాయింపు ఉంది. ఇక ట్రంప్ సర్కార్ విధించిన అధిక సుంకాలతో అమెరికా విధిస్తున్న సుంకాల్లో భారత్.. బ్రెజిల్‌తో కలిసి 50 శాతంతో తొలి స్థానంలో ఉన్నాయి. గతంలో చైనాతో తీవ్ర స్థాయిలో వాణిజ్య యుద్ధం చెలరేగినప్పటికీ.. ఆ దేశంపై మాత్రం 30 శాతం కంటే తక్కువే సుంకాలు విధిస్తోంది అమెరికా.౧౧ థింక్ ట్యాంక్ జీటీఆర్ఐ ప్రకారం.. ట్రంప్ సుంకాలతో అమెరికాకు వెళ్లే భారత్ నుంచి ఎగుమతులు 40 శాతం వరకు తగ్గొచ్చని తెలుస్తోంది. ఇంకా అమెరికాలో భారతీయ వస్తువులు ఖరీదైనవిగా మారుతాయని అభిప్రాయపడింది.జీటీఆర్ఐ ప్రకారం.. ఇతర డంపింగ్ డ్యూటీలతో కలిపి మన ఉత్పత్తులపై మొత్తం సుంకాలు 50 శాతం కంటే ఎక్కువ ఉంటాయని చెబుతోంది. ఇందులో సేంద్రీయ రసాయనాలపై 54 శాతం వరకుబీ కార్పెట్స్‌పై 52.9 శాతం ఉండొచ్చని చెబుతోంది. దుస్తుల్లో అల్లిన వాటికి 63.9 శాతం, నేసినవి 60.3 శాతం సుంకాలు ఉంటాయి. తయారు చేసిన వస్త్రాలపై 59 శాతంబీ డైమండ్స్, గోల్డ్ అండ్ ప్రొడక్ట్స్‌పై 52.1 శాతం ఉంది.2024-25 లో భారత్- అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లుగా ఉంది. వీటిల్లో టెక్స్‌టైల్, క్లాతింగ్ సెక్టార్ బిజినెస్ ఎక్కువ జరుగుతుంది. దీని విలువే గత ఆర్థిక సంవత్సరంలో 10.3 బిలియన్ డాలర్లుగా ఉంది. జెమ్స్ అండ్ జువెల్లరీ వాటా 12 బిలియన్ డాలర్లు. ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ మెషినరీ విషయానికి వస్తే ఇది 9 బిలియన్ డాలర్లుగా ఉంది.

## దేశంలో తొలిసారి ఇలా.. కేవలం 8.5 శాతం వడ్డీతో క్రెడిట్ కార్డు.. బ్యాంక్ ఆఫర్ మామూలుగా లేదుగా..!




**న్యూఢిల్లీ-నవభూమి:**భారత క్రెడిట్ కార్డు హిస్టరీలోనే ఇది ఒక సంచలనం. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ కేవలం 8.50 శాతం వడ్డీ రేటుతో క్రెడిట్ కార్డును తీసుకొస్తోంది. సాధారణంగా క్రెడిట్ కార్డులపై బ్యాంకులు 34-46 శాతం వడ్డీ రేట్లు వసూలు చేస్తుంటాయి. బిల్లు ఆలస్యమైతే వడ్డీల పేరుతో యూజర్ల జేబుకు చిల్లులు పెడతాయి. చాలా మంది ఈ వడ్డీ రేట్లతో అప్పుల ఊబిలో కూరుకుపోతుంటారు. క్రెడిట్ కార్డుల బిల్లులు కంటే వడ్డీలే ఎక్కువ చెల్లిస్తుంటారు. అలాంటిది, ఇండస్ట్రీ సగటు వడ్డీ రేటు కంటే అత్యల్ప వడ్డీ రేటుతో క్రెడిట్ కార్డు సేవలు తీసుకొస్తున్నట్లు ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఇది క్రెడిట్ కార్డు మార్కెట్లో సంచలనం సృష్టిస్తుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అయితే వడ్డీ రేట్లు అనేవి కస్టమర్ క్రెడిట్ ప్రొఫైల్ ఆధారంగా ఉంటాయని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. తిరిగి చెల్లించే సామర్థ్యం, క్రెడిట్ స్కోర్ బాగున్న వారికి అతి తక్కువ వడ్డీ రేటుతో కార్డు ఇస్తామని తెలిపింది. క్రెడిట్ కార్డుల వినియోగాన్ని ఆకర్షణీయంగా మార్చడం, వినియోగదారుల అవసరాలు తీర్చడంలో ఆమోదయోగ్యమైన వడ్డీ రేట్లు వసూలు చేయాలని భావిస్తున్నట్లు బ్యాంక్ తెలిపింది. ఇందులో భాగంగానే దేశంలోనే తొలిసారి 8.5 శాతం వడ్డీ రేటు ఆఫర్ ప్రకటించినట్లు తెలుస్తోంది.మరోవైపు లైఫ్ టైమ్ ఫ్రీ క్రెడిట్ కార్డులు సైతం అందిస్తోంది. కస్టమర్ల ఆదాయ వ్యయాలకు అనుగుణంగా వైవిధ్యంగా ఉండేలా ఈ ఆఫర్ తెచ్చింది. ఫస్ట్ క్లాస్, ఫస్ట్ మిలేనియా క్రెడిట్ కార్డులతో సినిమా టికెట్లపై ప్రతి నెల రూ. 100 వరకు డిస్కౌంట్ లభిస్తుందని తెలిపింది. ఫస్ట్ సెలక్ట్, ఫస్ట్ వెల్త్ ప్రీమియం కార్డులపై కాంప్లిమెంటరీ ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్ సహా అంతర్జాతీయ ట్రాన్సాక్షన్లపై తక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే ఇప్పటి వరకు క్రెడిట్ కార్డు వినియోగించని వారిని ఆకర్షించేందుకు ఫస్ట్ వావ్ పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆధారిత కార్డులు ఇస్తున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయం క్రెడిట్ కార్డుల ప్రపంచంలోకి వారిని సులభంగా ప్రవేశించేలా చేస్తుందని పేర్కొంది. ఈ కార్డులపైనా ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తోంది.ఫస్ట్ వావ్ క్రెడిట్ కార్డులపై పొందే రివార్డు పాయింట్లకు ఎలాంటి డెడ్ లైన్ ఉండదు. వాటిని ఎప్పుడైనా ఎక్కడైనా ఉపయోగించుకోవచ్చు.

ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ చేస్తే 45 రోజుల వరకు వడ్డీ చెల్లించనక్కర్లేదు. దీంతో అత్యవసర సమయాల్లో డబ్బు ఈజీగా పొందవచ్చు. అదనపు ఛార్జీలూ ఉండవు.

వినియోగదారుల క్రెడిట్ ప్రొఫైల్, తిరిగి చెల్లించే సామర్థ్యం ఆధారంగా వడ్డీ రేటు భిన్నంగా ఉంటుంది. ఆర్థిక క్రమ శిక్షణ గల వారికి వడ్డీ చాలా తక్కువ ఉంటుంది.

ఐడీఎఫ్సీ మొబైల్ యాప్‌తో క్రెడిట్ కార్డులను చాలా ఈజీగా నిర్వహించవచ్చు.

## దివీస్ లాభం రూ 545 కోట్లు




**హైదరాబాద్-నవభూమి:**దివీస్ లాభం రూ.545 కోట్లు వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి దివీస్ లేబరేటరీస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయాయి. ఈ కాలానికి కంపెనీ రూ.2,410 కోట్ల ఆదాయంపై రూ.756 కోట్ల స్థూల లాభం, రూ.545 కోట్ల నికర లాభం ఆర్జించింది.

గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 14 శాతం, స్థూల లాభం 16.3 శాతం, నికర లాభం 27 శాతం పెరిగాయి. అయితే మార్కెట్ వర్గాలు ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.2,437 కోట్ల ఆదాయంపై రూ.794.8 కోట్ల స్థూల లాభం, రూ.573.25 కోట్ల వరకు నికర లాభం నమోదు చేస్తుందని అంచనా వేశాయి. జూన్ త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభ శాతం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 0.7 శాతం పెరిగి 31.4 శాతానికి చేరింది.

క్యూ1 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బుధవారం బీఎసఈలో దివీస్ షేర్లు 4.29 శాతం నష్టపోయి రూ.6,134.25 వద్ద ముగిశాయి.

